నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ గురువారం 29-4-2021

## నేటికవిత-కవిత్వ విశ్లేషణ


-దాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240


-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

నేటికవితలో ఈ వారం: ధనమూలమిదం
అనే అంశంపై వచ్చిన 39 కవితల సమీక్షలో అత్యుత్తమంగా నిలిచిన
కవితల్లోంచి ఓ మూడు ఎంపికయిన కవితలపై విశ్లేషణ

## రూపాయి చుట్టూ

జేబులో రూపాయి
పగలబడి నవ్వుతోంది
మనిషి కంటే
తన జాతకమే గొప్పదని
బడాయి పోతోంది
తనకోసం లడాయి చేస్తుంటే..

పనిచుట్టూ పరుచుకోవాల్సిన నోట్లు
ఒద్దున కూసున్న
ఏసీల కుక్కపిల్లను దువ్వుతూ
త్రిజోరీలో ఉక్కపోతను భరిస్తూ
బయటకు రాకుండా కాపలా కుక్కలు.

పైసలకు నిలువ నీడ లేకుండాచేసి
బొక్కబోర్లా పడింది రూపాయి
తన విలువ తనే పడేసుకుంది
మిగిలిపోయిన
పైసలు ప్రదర్శన శాలలో

రూపాయి చుట్టూ
ఆగని బొంగరంలా తిరుగుతున్న భూమి
మనిషిని మార్చింది సంతలో సరుకులా
అమ్మకం కాని మొండి వస్తువు
ఊచల వెనుక షోకేసులో బొమ్మలా
పడరాని పాట్లు పడుతూ.

కరోనా వైరస్ ఎందరి ఉసురు తీసుకుందో
బతుకు తోటకూర కాడలా
వాలిపోవద్దని గుర్తు చేసింది
మనిషికోసం మనసులు
తొక్కులాడేలా చేసింది
రూపాయి ఆసుపత్రిలో బలిసిపోయింది
అవసరాల జేబులను చింపి వేలాడదీసింది.

రూపాయి కోసం ఏడ్చే పాపాయిలు దేశాలు
వైరస్ ఎంత కమ్ముకుని కరిచినా
చీమ కరిచినంత బాధ పడట్లే
ఎవడి బతుకు
గొంగడి వాడే కాపాడుకోవాలిక


-కొమురవెల్లి అంజయ్య
98480 05676

సీనియర్ కవి కొమురవెల్లి అంజయ్య గారు 'ధనమూలమిదం' అంశంపై 'రూపాయి చుట్టూ' శీర్షికతో రాసిన కవిత ఆద్యంతం ఆసక్తికరంగా మలచబడింది. పైసలకు నిలువ నీడ లేకుండా చేసి.. బొక్కబోర్లా పడిన రూపాయి గురించి కవి ప్రకటించిన భావాలు బాగున్నాయి. రూపాయి తన విలువ తనే పడేసుకుందనీ... మిగిలిపోయిన పైసలు ప్రదర్శనశాలలో అంటూ నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టారు. రూపాయి చుట్టూ ఆగని బొంగరంలా తిరుగుతున్న భూమి సంతలో సరుకులా..అమ్మకం కాని మొండివస్తువై ఊచల వెనుక షోకేసులో బొమ్మలా పడరాని పాట్లు పడుతోందని వ్యాఖ్యానించారు.

కవి అభివ్యక్తిలో నవ్యతను పాటించారు. ఎత్తుగడలో రూపాయి జేబులో పగలబడి నవ్వుతోందని ప్రారంభించడంలో కవి ప్రదర్శించిన ప్రతిభ ప్రశంసనీయం. మనిషికంటే తన జాతకమే గొప్పదని బడాయిపోతున్న విషయాన్ని కవితాత్మకంగా ఆవిష్కరించారు. పనిచుట్టూ పరుచుకోవాల్సిన నోట్లు ఒద్దున కూసున్న ఏ.సీల కుక్కపిల్లను దువ్వుతూ త్రిజోరీలో ఉక్కపోతను భరిస్తూ బయటకు రాకుండా కాపలా కుక్కలు అంటూ కొనసాగించడం బాగుంది.

కవి వస్తువు వెలుగులో ఆధునిక సమాజంలోని పరిస్థితులను ప్రతిబింబింపజేయడంలో సఫలీకృతులైనారు. కరోనా వైరస్ ఎందరి ఉసురు తీసుకుందో.. బతుకు తోటకూరకాడలా వాలి పోవద్దని రూపాయి గుర్తుచేసిందని పేర్కొన్నారు. రూపాయి ఆసుపత్రిలో బలిసిపోయిందని, అవసరాల జేబులను చింపి వేలాడదీసిందని.. మనిషి కోసం మనసులు తొక్కులాడేలా చేసిందని ఆవిష్కరించారు.

కవిత ముగింపులో ఎవడి బతుకు గొంగడి వాడే కాపాడుకోవాలిక అన్న సందేశం ఇచ్చారు. రూపాయి కోసం ఏడ్చే పాపాయిలు దేశాలు.. వైరస్ ఎంత కమ్ముకుని కరిచినా చీమ కరిచినంత బాధ పడట్లేదని చెప్పడం బాగుంది. కవి నర్మగర్భంగా గాఢమైన భావాలకు చోటు కల్పిస్తూ కవితను కొనసాగించారు. నేడు రూపాయి చుట్టూ పరుగులు తీస్తున్న తీరు తెన్నులను కవి అక్షరాల్లో నిక్షిప్తం చేసి పాఠకులను మెప్పించారు. కవి అంజయ్యగారు వస్తువిశ్లేషణతో పాటు సరళమైన పదాలకు చోటు కల్పిస్తూ రాసిన తీరు బాగుంది.

## అన్నీ ఆర్థిక సంబంధాలే

అదేంటో..
అనాగరికం నుండి
ఆధునికతవైపు వేసిన అడుగులన్నీ..
ఆర్థికాలోచనలను
పుణికిపుచ్చుకున్నాయెందుకో..

ధనార్జనే మూలంగా
దయాదాక్షిణ్యాలు వదిలేస్తూ..
విలాసాలే ధ్యేయంగా
విలువలను నిలువునా పాతరేస్తూ..

నిజమే మరి
విచక్షణకు తావెక్కడిది
సంపదపై మమకారం
మానవత్వాన్ని మరచిపోయి
స్వార్థబీజాలను నాటుతుంటే

అనురాగ పరిమళాన్ని ఆస్వాదించే
సమయమెక్కడిది..
కోట్లను కూడబెట్టుటకే వెంపర్లాడుతూ
పాట్లెన్నో పడుతుంటే..

ఒకే తీగకు కాసిన పిందెలైతేనేమి..
ఒకే గుంపులో కలిసి పెంపైన స్నేహమైతేనేమి..
కృత్రిమత్వ గాలులు వీస్తున్న మానవ ఎడారిలో
అనురాగాలన్నీ ఇగిరిపోతున్నాయి
బంధాలన్నీ ఆర్థిక సంబంధాలై
మమతలను మాయం చేస్తుంటే..

భోగభాగ్యాలే
సర్వమన్న మాటను మరవాల్సిందే
పోయే ప్రాణాన్ని ఆపని పైసలు నిరర్థకమనే
నిక్కాన్ని ఒప్పుకోవాల్సిందే..
ప్రకృతి వికృతేళిలో ప్రాణాలు తృణమవుతుంటే
అగోచర వైరస్ సైతం అంతస్తులను
చూడక కాయాలను కబళిస్తుంటే..


-స్వప్న కృష్ణ
9440536669

కవయిత్రి శ్రీమతి స్వప్నకృష్ణ గారు 'అన్నీ ఆర్థిక సంబంధాలే' శీర్షికతో..రాసిన కవితలో భోగభాగ్యాలే సర్వమన్న మాటను ఇక మరవాల్సిందేనన్న సందేశం అందించారు. కరోనా నేపథ్యంలో పోయే ప్రాణాన్ని ఆపని పైసలు నిరర్థకమనే నిక్కాన్ని ఒప్పుకోవాల్సిందేనని నొక్కి వక్కాణించారు. కవితావస్తువును పరిపుష్టం చేయడానికి ప్రయత్నించిన తీరు బాగుంది. ప్రకృతి వికృత కేళిలో ప్రాణాలు తృణప్రాయమవుతుంటే.. అగోచర వైరస్ సైతం అంతస్తులను చూడక కాయాలను కబళిస్తోందని వాపోయారు. మానవత్వాన్ని మరిచిపోయి స్వార్థ బీజాలు నాటుతూ సంపదపై మమకారం పెంచుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. ధనార్జనే ధ్యేయంగా దయాదాక్షిణ్యాలు వదిలేస్తూ విలాసాలే లక్ష్యంగా విలువలు నిలువునా పాతరేస్తున్న తీరుతెన్నుల పట్ల కవయిత్రి తమ విచారాన్ని ప్రకటించారు.

డబ్బు సంపాదనపై ఉన్న మోజులో సంబంధ బాంధవ్యాలను కాపాడుకునేందుకు .. అనురాగ పరిమళాలను ఆస్వాదించేందుకు సమయమెక్కడిది? అని ప్రశ్నించారు. కోట్లను కూడ బెట్టేందుకు వెంపర్లాడుతున్న మనుసుల నైజాన్ని ఎండగట్టారు.

అదేంటో... అనాగరికం నుండి ఆధునికత వైపు వేసే అడుగులన్నీ ఆర్థికాలోచనలను పుణికి పుచ్చుకోవడాన్ని ప్రస్తావిస్తూ కవయిత్రి స్వప్నగారు కవితను ఎత్తుకున్న తీరు బాగుంది.

కవయిత్రి స్వప్న గారు అలతి అలతి పదాలతో యివ్వబడిన కవితావస్తువును కవితామయం చేశారు. డబ్బే సర్వస్వం అనే ఆలోచన సరికాదని తేల్చి చెప్పారు. పదబంధ ప్రయోగంలో ఔచిత్యాన్ని పాటించారు. శిల్పం అభివ్యక్తి వంటి విషయాల్లో పరిణతి సాధిస్తారన్న విశ్వాసం ఉంది.

## ధనం మూలం ఇదం జగత్తే

నోరు లేకుంటేనేం
నోట్లై మనుషుల్ని ఆడిస్తోంది
చేతులు లేకుంటేనేం
ఎన్నెన్నో చేతులు మారి
బతుకు తలరాతలు రాస్తోంది!.

కాళ్ళు లేకుంటేనేం
కలవారి ఇండ్లకు గుణగుణా నడిచెళ్లుతూ
చూపు లేకుంటేనేం
ప్రపంచాన్ని తన కనుసన్నల్లో శాసిస్తోంది!

బతుకు బండికి ఇంధనం కావాల్సిన ధనం
ఉన్నవాళ్ళ త్రిజోరీలలో
ఊడిగం చేస్తోంది..

లేని వాడి జేబును
చిల్లిపడిన కుండను చేసి
పాదరసమై జారిపోతుంది!
పదవి ఉన్న నాయకునిలా విర్రవీగుతూ
కార్పోరేట్ హాస్పిటల్లలో
మీసాలు మెలేసి
రాబందులా చచ్చిన శవాలపై
చిల్లర ఏరుకుని
చచ్చేప్పుడు చారెడు మట్టికింద
సమాధై పోతుంది!.

అయినా..
చూడగానే చొంగలు కారేలా చేసే
ధనవ్యామోహం
మనుషులకు ఉత్థాన పతనాలు
చవిచూపిస్తూ
జీవితాలతో దోబూచులాడే ధనం
ఇదం మూలం మిదం జగత్తే


-వురిమళ్ళ సునంద
9441815722

సీనియర్ కవయిత్రి శ్రీమతి వురిమళ్ళ సునంద గారు 'ధనమూలమిదం' అంశంపై ధనం మూలం ఇదం జగత్తే శీర్షికతో తమ కవితను తీర్చిదిద్దారు. మనుష్యులకు ఉత్థాన పతనాలను చవిచూపిస్తూ జీవితాలతో దోబూచులాడే ధనం మూలం ఇదం జగత్తేనని తేల్చి చెప్పారు. కవయిత్రి సునందగారు అభివ్యక్తిలో విలక్షణతను ప్రదర్శించారు. కొంత చమత్కారం.. మరికొంత వ్యంగ్యం జోడించి కవితను చక్కగా రూపుదిద్దారు. ఎత్తుగడలోనే కవయిత్రి తమ చమత్కృతిని ప్రదర్శించారు. పాఠకుల్లో కవితపట్ల ఆసక్తిని పెంచారు.

నోరులేకుంటేనేం.. నోట్లై మనుషుల్ని ఆడిస్తోందని వ్యాఖ్యానించారు. చేతులు లేకుంటేనేం..ఎన్నెన్నో చేతులు మారి బతుకు తలరాతలు రాస్తోందంటూ కవయిత్రి రాసిన పంక్తులు బాగున్నాయి. కాళ్ళు లేకుంటేనేం.. కలవారి ఇండ్లకు గుణగుణా నడిచి వెళుతూ చూపు లేకుంటేనేం ప్రపంచాన్ని తన కనుసన్నల్లో శాసిస్తోందని తేల్చిచెప్పారు. డబ్బుకు నోరు లేకుంటేనేం.. చేతులు లేకుంటేనేం.. కాళ్ళు లేకుంటేనేం.. చూపు లేకుంటేనేం.. అంటూ కవితావస్తువు వెలుగులో కవయిత్రి ప్రకటించిన భావాలు కవితలో చక్కగా ఒదిగి పోయాయి. బతుకు బండికి ఇంధనం కావాల్సిన ధనం ఉన్నవాళ్ళ త్రిజోరీల్లో ఊడిగం చేస్తోందని వాపోయారు. లేనివాడి జేబును చిల్లిపడిన కుండను చేసి పాదరసమై జారిపోతోందని కవితాత్మకంగా తమ ఆలోచనలను అక్షరాలలో బంధించారు. 'పదవి ఉన్న నాయకునిలా విర్రవీగుతూ.. కార్పోరేటు హాస్పిటల్లలో మీసాలు మెలేసి రాబందులా చచ్చిన శవాలపై చిల్లర ఏరుకుని' అంటూ కొనసాగించిన పంక్తులు ఆర్ద్రంగా రూపుదిద్దుకున్నాయి.

కవయిత్రి సునంద గారు అభివ్యక్తిలో కొత్తదనాన్ని పాటించారు. చతురతతో కూడిన శిల్పానికి సముచితమైన చోటు కల్పించారు. అంతటా ధనానికే పెద్దపీట వేస్తున్న స్థితిగతుల్ని కనబర్చి కవయిత్రి తమ కవితలో ప్రస్తావించిన తీరు అభినందనీయంగా ఉంది.

## ఖతర్నాక్ మన్మధా! కాస్త జాగ్రత్త

తెలుగువాళ్లందరూ ఎప్పుడూ
లవఖుషులు, లవ్‌ఖుష్‌లు
ఈ ఏడాది మాత్రం ప్లవకాశీలే అందరూ
ఎప్పుడూ మనకు భవబంధాలు ఉంటాయి
ఇప్పుడు అన్నీ ప్లవబంధాలే!
జవసత్వాలు ప్లవసత్వాలు అయ్యాయి
మన్మధుడా! మరిచిపోకుండా
మైమరిచిపోకుండా వ్యాక్సిన్ వేయించుకో
'టీకా' తాత్పర్యాలు తెలుసుకో
'ఎలాగూ 'తగలబడి' చచ్చానుగా నాకేంటి'
అని నిర్లక్ష్యంగా ఉండకు
చచ్చినట్టు వ్యాక్సిన్ వేయించుకుంటే
మహా అయితే వచ్చేది జ్వరమేగా
అదీ విరహ జ్వరమనుకో
ఏకాంతంలోనే ఉండు
ఏకాంతనూ దరిజేరనివ్వకు
మన్మధా! ఈ ఏడాది అయినా
ఆటపాటలు 'ఆటా' పాటలు
పొంగిపొరలే దారిలో నువు
పాటు పడవోయ్, పాటు పాడవోయ్

నీ కోసం 'పాడి' పాడ చచ్చానే అనకు
(పాడీ, పాడీ చచ్చినవాళ్ళు ఎవరుంటారు?
వినీ వినీ చచ్చిన వాళ్ళే ఉంటారు)
గొంతు బాగా లేకపోతే
అనవసరంగా పాడకు
'రాగ నిరోధక శక్తి పెంపొందించుకో
అదే నీకు భోగనిరోధకశక్తి
సుందర వదనుణ్ణని
తొందరపడకు మన్మధా
పంచబాణాలు ఊరికే పంచకు
తెలుగువాడు ప్రతివాడూ
పంచెబాణుడే
తెలుగువాడు పంచెకట్టుటలో
ప్రపంచాన మొనగాడు అన్నారు కదా సినారె
పంచెకట్టుటలోనే కాదు
'పంచ్' కొట్టుటలోనూ
ప్రపంచాన మొనగాడు తెలుగువాడే కదా!
టాస్కకేం తొందర మాస్క్ పెట్టుకో ముందర
'ఫీల్‌కాకు అందరూ
ఇప్పుడు 'మాస్కులు' దరించిన
'మాస్కోడి గామాలే
అందరూ ఇప్పుడు ముక్కు నోరూ
మూసుకున్న మూస్కోడిగామాలే

'కామంసెన్స్' కాదు, కామన్‌సెన్స్ నేర్చుకో
కొత్త దంపతులకూ
సోషల్ డిస్టెన్స్ పాటించమని చెప్పు
కాలం కలిసివస్తే నీ
గాలం కలిసి వస్తుందిలే ఊరుకో
మన్మధా! జడదెబ్బలు తట్టుకోగలవు గానీ
వడదెబ్బలు తట్టుకోగలవుగానీ
కోవిడ దెబ్బతో తట్టుకోలేవు జాగ్రత్త
ఎప్పటికైనా భోగంతో మంచానపడు
రోగంతో మంచాన పడకు
వసంతకాలం, వసంతకాలం అని
మురిసిపోకు బంగారంలా మెరిసిపోకు
వసంతకాలం సంతకాలం అయింది
ఎంత రేటుకు అంతసుఖం
ఎంత రేటుకు అంత సౌకర్యం
అన్నట్టు కోకిలమ్మలు, కూడా
పక్కా కమర్షియల్ అయిపోయాయి
ప్రకృతిని మరిచి
పక్కా బిల్డింగుల్లోనే పాడుతున్నాయి
'పాడుకో.. యిలా' అంటున్నాయి.
మన్మధా! అర్జంటుగా దాక్కో
నీవు కనబడితే
తెలుగు మహిళలు
'పచ్చడి పచ్చడి' చేసేస్తారు.
నీ పంచాంగం బయటపెట్టేస్తారు
ఎందుకయినా మంచిది
కాస్త ముందు వెనకలు చూసుకో
మన్మధా! నీకు అంత అందగాడనే
పేరు ఎలా వచ్చింది?
'హీరో' ఎలా అయ్యావు?
మీ నాన్న ఏమయినా
సినిమా నిర్మాతనా
పెద్ద కోటీశ్వరుడా
అయినా అయినా.
ఖతర్‌నాక్ మన్మధా!
విర్రవీగకు
కాస్త జాగ్రత్త!


- హాస్య బ్రహ్మ
శంకర నారాయణ
సెల్:8008333227

## భూపాలరాగం

చలనమే చోదకశక్తిగా
ఎగిరే పక్షులు
వేకువ రాజహంసలు.

వేదనలు వాదనల జుగల్బందీతో రాత్రో
జాగారపు పిట్ట
జ్ఞాపకాలను వెతుక్కుంటోంది.

వెలగని ఆశలదీపంలా
అస్థిమిత దారుల్లో
అలసిన మనసు.

భయంనిండిన ప్రాణాలన్నీ
మాస్క్ చాటున ముడుచుకుని
మౌనాన్ని ధ్యానిస్తున్నాయి.

అర్థంకాని శాసనమై
బతుకిప్పుడో గజిబిజి రాత
తెల్లారే క్షణమెప్పుడో తెలీదు.

కలో మెలకువో తెలీని
సంధికాలం పలికే ఆహ్వానం
నల్లమబ్బై నవ్వుతోంది.

గోడమీది పిల్లులై
దొర్లే మనుషులే ఎటుచూసినా
చెదలుపట్టిన జీవితాలే చుట్టూ

వేకువపిట్టను ధ్యానం చేద్దామని
చుట్టూ చూశాను
మారాం చేస్తూ మారనంటూ
బతుకు భూపాలరాగాన్నందుకుంది


-సి.యస్.రాంబాబు
8374818961

## భల్లం భాష్యం

## కవిత్వం కోసమే కవిగా పుట్టినప్పుడు...

పాతబడిన శిల్ప, వికాసం కోల్పోయిన భాష అరిగి వొరిగి పోతున్న భావ చిత్రం, ఇవన్నీ కలిసి, సృజనాత్మక కవిత్వాన్ని కాలంతో పాటు ముందుకు నడిపించలేక వెనుకబాటు తనానికి గురి చేస్తున్నాయేమో..

కవిత్వంలో ఎక్కువగా ఆవేశం, తక్కువగా కల్పన ఉండే మాట కొంత వాస్తవమే, కానీ– ఆధునిక సమకాలీన కవిత్వాన్ని మొత్తం ప్రాచీన కవిత్వంలా అతిగా కల్పనలలో నింపకూడదు. అడుగడుగునా, ఆవేశం వొంపకూడదు. కవిత్వం భావ చిత్రీకరణతో, ప్రతీకాత్మకంతో, అంతకు ముందు లేదా అంటే ఉంది గాని –పరిపూర్ణతని సాధించుకొన్నది మాత్రం కాలక్రమానుగతమే.

కవిత్వీకరిస్తే కనకవర్షం కురుస్తుందా అని మాట వరసకు ఎవరైనా అంటే అవుననే అనాలి. కవి కవిత్వీకరించే ప్రతి కవితా ఎదుటి వారు శ్రద్ధగా వినాలి అంటే కవి మితంగానూ, హితంగానూ రాయాలి. ఆలోచనల్లోనూ, భావాల్లోనూ, ఉన్నట్లే కవిత్వంలోనూ సకారాత్మకాలు, నకారాత్మకాలు వున్నాయని కవి గ్రహించుకోవాలి.

ఎంత కాలం నుంచి ఇంకెంత కాలం రాస్తున్నాడు కవి అని కాక, ఏం రాస్తున్నాడన్నదే, ఎలా రాస్తున్నాడని ముఖ్యాతి ముఖ్యం. ఒక కుకవి కవిత్వం రాయకపోయినంత మాత్రాన సమాజానికి ప్రమాదం ఎలా లేదో, ఒక కవి అకవిత్వం రాసినంత మాత్రన అలాగే ప్రపంచానికి ప్రయోజనం ఉండదు.

మనసు లోతుల్లోంచి వచ్చిన మంచి కవిత్వం ఉన్న పళంగా ఊపునిస్తుంది. ఊత్సాహన్నిస్తుంది. ఉన్నతినిస్తుంది. ఊరటనిస్తుంది. వేదన వేదాల నాదాలని దూరం చేస్తుంది. వేకువ పొద్దున వెచ్చ వెచ్చని చైతన్యాన్ని కలిగిస్తుంది. దిగులును మాయం చేస్తుంది. ధైర్యాన్నిస్తుంది. కాబట్టి మనసు తలుపులు తెరుచుకొని, గొంతు గుమ్మందాటి వచ్చే ప్రతీ కవితా, ఒకటికి వందసార్లు పరిశీలించుకోవాలి.

కవిత్వం కవిత్వం కోసం కాక. సామాజిక సమస్యలకు స్పందించి వెలువడేదే నిజమైన కవిత్వం. అది సామాజిక పరిస్థితులకు అనుగుణంగా పల్చగానో, చిక్కగానో ఉంటుంది. పల్లె చిత్రపటాన్ని బతుకుల్ని చిందరవందర చేస్తున్న పరిస్థితులు, రోజు రోజుకూ దిగజారిపోతున్న మానవ సంబంధాల విలువలు, చిన్నాభిన్న మవుతున్న ఆర్థిక వ్యవస్థ ఇత్యాదులు కవి అయిన వాడికి కవిత్వం సృజించడానికి ముఖ్య హేతువులవుతాయి.

సునాయాసంగా వచ్చే కవిత్వాన్ని–అనాయసంగా వ్యర్థం చేసెయ్యడం, మనకి ఎప్పటి నుంచో అలవాటు. అలా అని ఎలాపడితే, ఎక్కడబడితే, అలా నిర్లక్ష్యంగా లెక్కలేని తనంగా కవిత్వాన్ని వాడేస్తే– బూడిదలోపోసిన పన్నీరులా అర్థం బద్ధం

> కవి ఎన్ని రచనలు చేశాడన్నది ముఖ్యం కానే కాదు. కవి ఎన్ని రచనలయినా చేసి ఉండవచ్చు గాక, గొప్పగా పాఠకుల ఆదరణ పొందినవి, చిరకాలం నిలిచి పోయేవి కొన్ని మాత్రమే.

లేకుండా వ్యర్థమయిపోతుంది. అవసరం లేని చోట అదే పనిగా కవిత్వాన్ని వల్లించడం వల్ల అవతలి వారికి లోకువైపోతాం.

కవి ఎన్ని రచనలు చేశాడన్నది ముఖ్యం కానే కాదు. కవి ఎన్ని రచనలయినా చేసి ఉండవచ్చు గాక, గొప్పగా పాఠకుల ఆదరణ పొందినవి, చిరకాలం నిలిచి పోయేవి కొన్ని మాత్రమే.

కవిత్వం అందరికి అందనంత ఎత్తులో ఉంటుందని తేరిపార చూడ్డానికి కొందరు సాహసించరు. అందుకునే నిచ్చెన కావాలి. నిచ్చెన ఎవరిస్తారు..!? ఎవ్వరూ ఇవ్వరు. మనకు మనమే నిరంతర అధ్యయన శీలత్వంతో కవిత్వాన్ని ప్రసన్నం చేసుకోవాలి. అలా లభించిన కవిత్వాన్ని కాపాడుకోవాలి కూడా. కానీ అలా జరగడం లేదు.

దేనిని కవిత్వం చేస్తున్నామో, దాని గురించి నిజాయితీగా, నిష్కర్షగా అభిప్రాయసేకరణ రాబట్టి దేని గురించి కవిత్వం చేశామో, ఆ విషయంపట్ల, ఆ వస్తువు యొక్క పూర్వాపరాలు తెలుసుకొని ఎడ్యుకేట్ అవ్వడం, ఆ కవిత్వం చదివినవారు– కవిత్వ పాఠకులు అయ్యాలా చేయడం ఒక కళ అయితే, ప్రచార పటాటొపాన్ని సోత్కర్షలను అధిగమించి, సాహిత్య విమర్శ ఇరిటేట్ చేసినట్టున్నా, ఇంటరాగేట్ చేసినట్టున్నా, కవి తన అభిప్రాయాలను, ఉన్నది ఉన్నట్లుగా, భావ చిత్రాల మేరకు ప్రకటించి, కవి ప్రయోజనం పొంది తన నుండి కవిత్వ విషయం తెలుసుకొనగోరుతున్న పాఠకులకీ ప్రయోజం కలిగిన తృప్తి నివ్వడం గొప్ప కవిత్వకళేకదా.

కవిత్వమే కొందరికి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఊహాచిత్రాల మార్పుపైనే నమ్మకం. కవుల్లో సీనియర్లు, జూనియర్లు ఉండరు. వారి కవిత్వమే వారిని పెద్ద చిన్న కవుల్ని చేస్తుందంతే. ప్రతిభా వంతుడయిన కవి ఓ కొత్త మార్గాన్ని వెదుక్కుంటాడు. కానీ వాడేది రాసినా సంప్రదాయాన్ని నరికేయడానికి కాదు. సరిచేయడానికి ప్రథమతః ప్రయత్నం చేస్తుంటాడు.

కవిత్వం అనేది ఒక తపస్సు. కవి సమాధిలో కూర్చున్నాడా సరియైనా తాదాత్మ్యం సిద్ధించిందా..? ఇక ఆ కవికి భోగాల మీదికి దృష్టిపోదు. కష్టాలు కనబడవు. కవిత్వంలో మునిగిన కవి మానసిక స్థితి అలా వుంటుంది. కవి హృదయం అతి సున్నితం కాబట్టి, సాధారణ ప్రజలు చూడలేని ఆనందం చూడడమే కాదు. ఇతరులు కూడా ఇంతో ఎంతో పొందాలని కవిత్వ రచనకు పూనుకుంటాడు.

కవిత్వం– అద్దంలో మన ముఖం మనం చూసుకున్నట్టు ఉండాలి. వాస్తవానికి చాలా దగ్గరగా ఉండాలి. అత్యంత సహజంగా వుండాలి. మన సంతోషాలే కాదు. మన దుఃఖాన్ని మనలోపాల్ని పొల్లుపోకుండా ఎత్తి చూపాలి. కొత్త ఆలోచనలకు ఊపిరి పోయాలి. చీకటిలో చిక్కి శల్యమవుతున్న అనేక అంశాలను వెలుగులోకి తేవాలి.

నిరంతర కవిత్వ పాఠకులు–కవితా పంక్తుల వెనుక దాగిన సత్యాసత్యాల్ని పసిగట్టగలరు. సందర్భాల సాక్ష్యంగా సన్నివేశాలని చూడగలరు. ఆపై కూడబలుక్కోగలరు. పాఠకులకు అందిన అనుభవాన్ని, మబ్బుపెట్టి, లేని సందేహాలని, ప్రశంసలని సంత్రీకరణలని కవితో పాటు ఇతరులు వ్యక్తపరచినప్పుడు పాఠకులు అసంతృప్తికి లోనవుతారు. పైగా కవికి మేలుకన్నా ఆయా సందర్భాల్లో కీడే ఎక్కువగా జరిగే అవకాశాలు మెండుగా, నిండుగా, దండిగా ఉంటాయి.


-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

## పుస్తక సమీక్ష

# రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థ, పరిభాషణము






ప్రజానీకంతో నిరంతరంగా సంబంధాలను నెఱపుతూ, ప్రభుత్వం ప్రకటించే వివిధ స్కీములను ప్రజలకు అందచేస్తూ ప్రజలు చెల్లించే పన్నులను వసూలు చేసి ఖజానాకు చేరుస్తూ, అటు ప్రజలు, ఇటు ప్రభుత్వం మధ్య, ఒక ప్రభావపూరితమైన వాహిక (Conduit) గా వ్యవహరిస్తూ, ప్రభుత్వమనే శరీరానికి నాడీ వ్యవస్థగా పనిచేసేది 'రెవెన్యూ వ్యవస్థ'. అసాధారణ పరిస్థితులు అంటే కరువు, వరదలు ఎలక్షన్లు, జనాభాలెక్కలు, భూ సర్వేలు, ధృవ పత్రాల జారీలు, ప్రభుత్వ ఆస్తుల లెక్కలు, పరిరక్షణ, పంటల భీమా పథకాలు, వేయేల– రెవెన్యూ వ్యవస్థను "ఆమ్ ఆద్మీకా మా బాప్" అనటం అతిశయోక్తి కాదు. ఆకాశం కింద ఉన్న అన్ని పనులు రాత్రనకా పగలనకా చక్కబెట్టాల్సింది రెవెన్యూ వారే!

ఇంతటి ప్రాముఖ్యత ఉన్నా, జనానికి తహసీలు ఆఫీసుకు వెళ్ళాలన్నా, కలెక్టర్ కార్యాలయంలో పనిచేయించుకోవాలన్నా వణుకుపుడుతుంది. ఏ జన్మలో చేసుకున్న పాపమో భగవంతుడా! అంటూ అంగలార్చుతారు. పోనీ– రెవెన్యూ శాఖ ఉద్యోగులైనా ఆనందంగా ఉంటారా అంటే– అదీ లేదు. 24 గంటల ఉద్యోగం అనీ వెట్టిచాకిరీ అని సిబ్బంది వాపోతుంటారు

మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రచయిత డా॥ ఏనుగు నరసింహారెడ్డి పల్లీయుడు. కనుక పల్లెలతో సంబంధం ఉంది. పలు కవితా సంపుటాలు, అనువాద గ్రంథాలు విమర్శ పుస్తకాల రచయిత సమస్యకు లోతైన పరిశోధన గావించగలిగే సమర్థత ఉంది. తహసీలుదారు, డిప్యూటీ కలెక్టర్, స్పెషల్ గ్రేడ్! డిప్యూటీ కలెక్టర్‌గా పని చేశారు. రెవెన్యూ శాఖ లోపలి నుండీ బయటి నుండీ తరచి చూసిన అనుభవం ఉంది. సాహితీ వేత్తకు ఉండాల్సిన 'ఆర్తి' కొండంత ఉంది. అవగాహన, అనుభవం విశ్లేషణా సామర్థ్యం ఉంది. అందుకే ఈ చిన్ని సంకలనంలో రెవెన్యూ శాఖ భూత వర్తమాన, భవిష్యత్తులను, సాధక బాధకాలను, అవసరమయ్యే సంస్కరణలు ఆచరణలోని ఒడుదుడుకులను, కూలంకశంగా చర్చించారు.

'రెవెన్యూ శాఖలో పనిచేస్తూ అందులోని బహిరంతర స్వరూపాల్ని చూసిన వాడిగా నాకు చాలా భేదముంది. ప్రజలు మనల్ని శపిస్తూ ఉంటే మనం ఏమీ చేయలేని తనంలో ఆగిపోవటం అన్యాయంగా ఉంది. కొద్దో గొప్పో ఏదైనా చేద్దామనే వాళ్ళకు సామాన్య ప్రజల పక్షం వహించే వాళ్ళకు రాళ్ళ దెబ్బలు తగులుతాయి. ఇదొక దైన్యం.

ఈ దైన్యం నుండి రెవెన్యూ ఉద్యోగులు బయటపడాలన్నా ఈ శాఖపట్ల ప్రజలు ప్రేమ కలిగి ఉండాలన్నా, రెవెన్యూ శాఖ సమూలంగా సంస్కరించబడాలి. ఆ సంస్కరణలు ఎలా ఎప్పుడు మొదలవుతాయో తెలియక నా ఆవేదన.ఆ ఆవేదన ఈ పుస్తక రూపం ధరించింది" అంటారు (పే.9) రచయిత.

అందుకే ఈ చిన్ని సంకలనం (పేజీలు 123) అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు, ఎంతో అమ్యూలమైనది. పది అధ్యాయాల్లో రచయిత రెవెన్యూ శాఖ తీరుతెన్నులు, రెవెన్యూ పారిభాషిక పదాలు అవసరమైన సంస్కరణలు ప్రతిపాదించారు. అనుబంధంగా నలుగురు ప్రముఖుల అభిప్రాయాలు పొందుపరిచారు. తాను చెప్పిన విషయాలకు నిర్దిష్టత చేకూర్చేందుకు ఉపయుక్త గ్రంథసూచి (పే.124) ఇచ్చారు. నిజాయితీగా ఎన్నో అధ్యాయాల్లో తన మనసు విప్పుకున్నారు. అధికారి ఉండి కూడా తన శాఖలోని డొల్లతనాన్ని నిజాయితీగా వివరించారు. చట్టాల అమలులో (ఉద్యోగికి) త్రికరణ శుద్ధి ఉంటే చాలు. శాఖ యొక్క ఔన్నత్యం పెరుగుతుందని ప్రకటించిన అధికారి ఏనుగు నర్సింహారెడ్డి కలం నుండి వెలువడిన ఈ సంకలనం ప్రభుత్వాన్ని , ప్రభుత్వోద్యోగులనూ ఆత్మ విమర్శ చేసుకోవాల్సింగా, ఆవేదనతో, ఆర్తితో అభ్యర్తిస్తున్నారు.

**ప్రతులకు:** అన్ని పుస్తక కేంద్రాలలో
అడుగుజాడలు పబ్లికేషన్స్, ఎంఎస్‌కె టవర్స్, ఫ్లాట్‌నెం. 410
స్ట్రీట్ నెం.11, హిమాయత్‌నగర్, హైదరాబాద్–500 029.
సెల్: 89788 69183


- కూర చిదంబరం
సెల్: 8639338675

## నానీలు

ప్రతి పనిని
తపస్సులా చేస్తున్నాడు
అయితే
అతడు రైతన్నే!

ఇంటి విస్తీర్ణం
పెద్దదైతే మంచిదే
మనసు వైశాల్యం
తగ్గకుంటే చాలు.


-వద్దేపల్లి సంధ్య
సెల్:7036000123

## ఎవరికి వారు

చుట్టూ ఒక శీతల గిడ్డంగి
మంచుపొర చుట్టుకున్నట్టు మసక బారిన చూపు
ఉన్నట్టుండి ఏ మూలనుండో గుప్పున గుమి గూడిన నైరాశ్యం
నాలుగు మూలలనా పరచుకు పొగచూరినట్టుంది.
ఊపిరి ఉండీ లేనట్టూ మెత్తని అలికిడి.
ఎవరికి వారు ........
ఆవిరి పొగల ధ్యాసే తప్ప అద్దం ముక్కల ఊసే లేదు
వీధి చివరి వరకూ నడచి వచ్చి మాటేసిన దాని మోహాన
కషాయాల కల్లాపి జల్లి లక్ష్మణ రేఖలు గీసుకుంటూ
ఎప్పటికప్పుడూ వీపు చరచుకున్నా
విమానం టికెట్లు కొనుక్కున్న పీడకలలే.
వసంతాలు హేమంతాలూ శిశిరమూ చిక్కని ఆషాఢమూ
అన్ని పదాలకూ అర్థం మారి – విలయ పవనం చిరునామా అయినా
తలా తోకాలేని చీకటి సముద్ర సమయాన్ని ఈదుతున్న తరానికి
గోరంత వెలుగులా సన్నని వెలుతురు చేప
ఎవరికి వారు సముజ్వల జలనాలై
ఒక వినిమయ ప్రపంచాన అమ్మకానికి పెట్టిన
అక్షర తోరణాలై
ఎవరికి వారు ప్రపంచం తెర చాప మీద
తమను తాము ప్రదర్శించుకుంటూ
లోలోన సడి లేని నీటి విస్ఫోటాలై
కరుగుతూ మరుగుతూ ప్రవహించలేని
శీతల శిలజాలు


-స్వాతీ శ్రీపాద
8297248988

## రామబాణం

ఎన్ని బాణాలు సంధించినా
శత్రువును అంతమొందించే
ఆ రామబాణమేదీ చేతికి చిక్కటం లేదు.

కోల్పోయిన సోదరులను తిరిగి బతికించే
ఏ సంజీవని పర్వతమూ
ఏ హన్మంతుడూ తెచ్చివటం లేదు.

అన్న మాట జవదాటని తమ్ముడు
లక్ష్మణుని గుణమేదీ
జనానికి ఇసుమంతైనా
వంటబట్టటం లేదు

ఎక్కడ పడితే అక్కడ
గుంపులు గుంపులుగా
వానర సైన్యంలా మూగిపోతున్నారు

సీత గీత దాటినట్టు
రోజు రోజుకీ పరిస్థితి
చేయి దాటుతోంది

ఇది రామాయణమూ కాదు
రామ రావణ యుద్ధమూ వుండదు
వైరస్ చెరనుండి
జనాన్ని విడిపించేందుకు
ఏ రాముడూ బయలుదేరి రాడు

ఇది వైరసాయణం
అప్రమత్తంగా మసలుకునే
ప్రజలే యుద్ధ వీరులు
మాస్కులూ, శానిటైజర్లూ,భౌతిక దూరాలే
కనిపించని
శత్రువునంతమొందించే
అసలైన రామబాణాలు


– చిత్తలూరి
8247432521

## గెలవటం ఓ కళ

తెలివితేటలున్న ప్రతీవాడు
గెలుస్తూపోడు
గెలవటం ఓ కళ
గెలిచే సామర్థ్యం నీకుండొచ్చు
గెలవలేక నిలుచున్న చోటే
చతికల పడొచ్చు
ఎందుకు గెలవలేదో
నీకు తెలియకనూ పోవచ్చు
కొన్ని సందర్భాలు అంతే
గెలిచిన ప్రతీవాడు
నీకంటె తెలివైనవాడు కాకపోవచ్చు
మరెందుకు గెలిచాడో
నీకు అంతుచిక్కకనూ పోవచ్చు.

గెలుపు లౌక్యం ఒకటుంటుంది
అది సహజాతమై వుంటుంది
అది నీ ఆలోచనల్ని
అల్లుకుంటూ వస్తోంది
అదృష్టాలు దురదృష్టాలు
అన్నీ ఒఠి మాటలే
గెలుపును గెలుసుకోలేనివి
దురదృష్ట మూసలోకి ఒలికిపోతాయి
కొన్ని అసంకల్పిత విజయాలు
అదృష్ట ఖాతాలోకి జారిపోతాయి
అయితే గెలుపు ఓ కళ అని
మన ఈగో వీడి ఒప్పుకోవాలి.

బలానికి అహం తోడైనప్పుడు
నిర్లక్ష్యం చాపక్రింద నీరై నిలుస్తుంది
విజయపు రేఖకు ఇవతల
నిన్ను పడుకోబెడుతుంది
బలహీనతకు పట్టుదల తోడైనప్పుడు
అంతర్గత శక్తులన్నీ ఐక్యమై
గెలుపుగుర్రం దౌడుతీస్తుంది
విజయపతాకాన్ని వేగంగా మోసుకుంటూ.
గెలుస్తున్నవాడు ఒక్కోమెట్టూ ఎక్కటానికి
ఎంతశక్తిని కూడగట్టుకుంటాడో
ఎంతపోరును ప్రోది చేసుకుంటాడో
గెలిచినవాడికే తెలుస్తుంది
వాడు గెలుపుకు వేసుకున్న మార్గం
మంచిదోకాదో కానీ

వాడు గెలవటం ఓ కళే
అయితే..
ఓడిన ప్రతీసారి
ఓ కొత్తపాఠం నువ్వు నేర్చుకుంటావు
ప్రతీ పాఠం ఓ కళై నిన్ను అలుముకుంటుంది.

ప్రతీ గెలుపు క్రింద
ఎన్నో వివరించలేని విప్పుకోలేని
బాధల మూలుగులుంటాయి
మొఖాలు చిరునవ్వును చిమ్మినా
గుండెకంటిన కన్నీటితడి ఆరదు
అందుకే..
గెలుపు ఓ కళ అని ఒప్పుకోవాలి..!
గెలుపు మన చేయిజారి నప్పుడు
వేలవేల నిట్టూర్పులు విడవొచ్చు
తప్పులేదు
ప్రయత్నపు ద్వారాలు మూయటమే తప్పు
ఏదో ఒకరోజు గెలుపు నిన్ను తడుతుంది.

సామాన్యాంగానో అసామాన్యాంగానో
నిన్ను తూకం వేసే తరాజు
ఒకరోజు విస్తుపోనూ వచ్చు
గెలిచినవాణ్ని నఖశిఖం చూడు
ఏదో ఓ కళ వైఫైలా
వాణ్ని చుట్టుకోని వుంటుంది
నిన్నునువ్వు గాఢంగా తట్టుకొని
ఓ గెలుపుకోసం తపించి చూడు
ఏదో ఓ శక్తి ఆయుధంలా
నిన్ను అంటిపెట్టుకుని వుంటుంది
ఓ వైబ్రేషన్‌ను సృష్టించుకొని
తనువెల్లా తరించు
ఓ కొత్త వత్సరాన్ని నీలోకి స్వాగతించు
గెలుపు గాలులు
నిన్ను తాకటం గమనిస్తావు
అయితే..
నువ్వు ఓడిపోయినప్పుడే తెలుస్తోంది
గెలవటం ఓ కళ అని..!


-డా.కటుకోఝ్వల రమేష్
సెల్:9949083327

## పులకిస్తున్న తెలుగు తల్లి



అద్భుతం వల్ల జరిగేది కొన్ని
అదృష్టం వల్ల జరిగేవి కొన్ని
స్వయం కృషి వల్ల జరిగేవి నిజంగా కొన్నే
సాధనమున పనులు
సమకూరు ధరలోన
ఈ శతక వాక్యానికి
మీరు నిలువెత్తు ఉదాహరణ
నిజాయితీ, నిర్భీతి అన్న మాటలకు
మీరు అసలుసిసలైన అర్థం
న్యాయ వ్యవస్థలో ఇన్నేళ్ళ మీ ప్రస్థానం
పక్షపాత రహితమైన
మీ స్వభావానికి ఒక మణి మకుటం
మాతృభాష పట్ల మీ దృష్టి
తెలుగు భాష భవితవ్యాన్ని
మరికొంత కాలం పరిపుష్టం చేస్తుంది
ఇంటి పనులకు తనువులు అరగదీస్తున్న
ఇంతుల సేవలకు విలువ కట్టాలన్న మీమాటలు
ముందు తరాలకు కూడా శిరోధార్యాలు
నేర చరితులు రాజకీయ దుస్తులు
తొడుక్కోకూడదన్న మీ భావన
మీ దార్శనికతను ఆవిష్కరిస్తున్నది

నేతలు ముందుతరం దూతలుగా
మారాలన్న మీ సంకల్పం
సాకారం కావాలన్నది మా ఆకాంక్ష
తెలుగు జాతి గౌరవవాచకాన్ని
న్యాయవ్యవస్థ సాలభాగం పైన
అర్థశతాబ్దం అనంతరం
తిరగవ్రాసిన ఘనత మీది
ప్రపంచానికే ఆదర్శప్రాయమైన
న్యాయవ్యవస్థ అగ్రాసనంపైన
తన తనయుడు కూర్చున్నాడని
తెలుగు తల్లి పులకించి పోతున్నది
చీకటి వసంతం గడచి
కొత్తకాంతులు చివురిస్తున్న వేళ
ఆ తల్లి ఆనందాన్ని చూసి
తెలుగు జాతి పరవశించి పోతున్నది.


– మద్దాళి రఘురాం
9866057777

## బానిస స్వేచ్ఛ

అలసిన దేహాలు శక్తిని కూడగట్టుకుని
సవరించుకున్న స్వరంతో
గొంతెత్తిన ప్రతిసారి
సొమ్మశిలెల్లా చిమ్మచీకట్లో కి తోస్తున్నారు
జీవితానికి ముడివేసిన బ్రతుకుల్ని
ఇక్కడే జీవ సమాధి చేసి
ఇది స్వేచ్ఛ భూమి అంటూ
గంభీరమైన స్వరంతో కళ్ళెర్రజేసి
ఒప్పుకో మంటాడు
కష్టంతో కందిపోయిన దేహాల్ని

కాని వాడు అంటున్న నీవు
సుకుమారంగా చెమట చుక్క పట్టకుండా
ఎక్కడ పునాది రాయి పాతినవో చెప్పు
కర్మభూమి బాహ్యంగా
వర్ణ వ్యవస్థతో
రాజ్యమేలుతుంది
ఈ దేశం ఎవరి రక్తంతో
నిర్మించబడిందో వాడ్ని
ఇంకా అణగదొక్కుతూనే
అంటారనోడ్ని జేసి రెక్కలు విడిచి
వాడి కాళ్ళ ముందు పడేసి

విముక్తి కలిగిస్తున్నా
స్వేచ్ఛగా ఎగిరి పో అంటాడు
ఇప్పుడు నేను
మండుతున్న అగ్నిగోళ్ళాని
నా సెగల నుండితప్పించుకోలేవు



-పొన్నగంటి ప్రభాకర్
8686306306

## యుద్ధం ఇంకా మిగిలే ఉంది

ముగింపు లేని
యుద్ధమే నాది..అవును..
యాడాదులు గడుస్తున్నా
వయసు ఉడిగి పోతున్నా
ఆగిపోనీ ఆరాట పోరాటాలు ...

రెక్కలు రాని చిన్ని కూనలని
రెక్కలు ముక్కలు చేసుకొని
చెమట చుక్కలతో
నా దాహాన్ని తీర్చుకుంటూ...
కన్నపేగు పాశానికి కట్టుబడి
కడుపు కట్టుకొని కడుపు నింపిన...

బుడి బుడి నడకలు నేర్చుకుంటే
బతుకు మీద భరోసా వచ్చేది...
వడివడిగా పరిగెత్తుతుంటే
వయసయ్యాక ఆసరా ఉంటారని
అశలే కలిగేవి...

రెక్కలొచ్చి ఎగురుతూ
ఎటో వెళ్లి పోయాకగాని
తెలియలేదు...
నన్ను ఒంటరి పక్షిని చేసి వెళ్లిపోయారని ...

ముగిసి పోతుంది అనుకున్నా
మెతుకు పోరాటం....
తిరిగి మొదలు పెట్టాలి ఇక
నా బతుకు పోరు
ఇంకా మిగిలే ఉంది....



-కళావతి కందగట్ల
9948263004

## అపర బ్రహ్మలు

వాళ్లు
అత్తెసరు జీవితాలకు ఆనవాళ్లు...
భద్రత లేని కొలువుల్లో భంగపడ్డ
అప్రకటిత బహిష్కృతులు...
చదువును నమ్ముకున్న పాపానికి
ధనస్వామ్య వ్యవస్థ నుండి
దూరంగా విసిరేయబడ్డ
వెర్రిమాలోకాలు...

భూమికీ, ఆకాశానికీ మధ్య
ఫలాలు లేని 'ప్రైవేటు'
ఊడలకు వేలాడుతున్నవాళ్లు....
బోధనలో రాటుదేలిన గురుపీఠాలైనా
గురుదక్షిణకు నోచుకోని మూగపక్షులు...

కూటికొరకు కోటి విద్యలు తెలియదు వాళ్లకు
పాఠం చెప్పడమనే కళ ఒక్కటే తెలుసు...!
తలరాతలు రాసే అపరబ్రహ్మలైనా
తమ బతుకుల్లో కమ్మిన చీకట్లను
కసురుకోలేని సుద్దముక్కల పంతులయ్యలు...

నిరుద్యోగ జాబితాల మాయాజాలంలో
నిలువు దోపిడీ చేయబడ్డ పరాజితులు...
కరోనా పురుగు కర్కశత్వానికి
బలైపోయిన పుస్తకాల పురుగులు...

వాళ్ల భవిష్యత్తు యిప్పుడు
అరిగిపోయిన చాక్ పీసు కన్నా అధ్వాన్నం..
పనికిరాని బ్లాక్ బోర్డ్ పై
ఉనికిలేని అక్షరాలు వాళ్లు...

వాళ్ల జీవితాలంటేనే
ఇప్పుడెవ్వరికీ అవసరం లేని 'సిలబస్'...
జ్ఞాన సమాజ నిర్మాణంలో
మూలస్తంభాలైనా
తమకంటూ ఒక అధ్యాయం లేని
బతకలేని బడి పంతుల్లు...
ఒంటి నిండా
'ఎర్ర సిరా' ఉప్పొంగుతున్నా
కన్నెర్ర చెయ్యని కరుణామయులు....



-డాక్టర్ మడత భాస్కర్
8919328582

## మానస వనంలో..

పరుచుకున్న ప్రేమాభిమానాల పచ్చికలు
సంతోష సరాగాల పూల పరిమళాలు
మొహపు పురి విప్పి ఆడే నెమళ్ళ నాట్యాలు
హాస వినోదాల చిలుకల తియ్యని పలుకులు.

భక్తి శ్రద్ధలు మేళవించిన ఇంద్ర ధనుస్సులు
మమకారపు గుబురు పొదల చెట్టపట్టాలు
ఉక్కు సంకల్పాల ఎత్తైన పర్వతాలు
ఆశల రాయంచల అలవోక ఈతలు.

భంగపాటుకు బెదిరి వెనుదిరిగే జింకల ఉరుకులు
ఈర్ష్యాసూయల క్రూరమృగాల గాండ్రింపులు
దృఢ నిర్ణయాల ఏనుగు పాదముద్రలు
స్ఫురించే ఉపాయాల నక్కల ఎత్తులు..జిత్తులు!

ఆలోచనా నదీ ప్రవాహపు తరంగాలు
ఆత్మన్యూనతా అత్తిపత్తుల సంకోచాలు
కోపతాపాల కార్చిచ్చుతో ఎగిసిపడే మంటలు
వలపు గెలుపుల వరద పొంగులు.

ఆందోళనా తుఫానుల తాకిడులు
కుతంత్రాల సుడిగాలుల అలజడులు
ఉబికే కన్నీటి ధారల ఆగని ఊటలు
నమ్మకపు సిద్ధాంతాలు కాలిబాటలు.

పగతో రగిలే విషసర్పాల బుసలు
త్యాగపు ఆకాశాన్నంటే వృక్ష వితరణలు
దయతో కలిసి నీరయ్యే మంచుకొండలు
అమాయకంగా దొరికిపోయే కుందేళ్ళ కోమల తత్వాలు.

భ్రమల్లో ముంచే ఊసరవెల్లుల మారే వర్ణాలు
అలసట దీర్చి హాయి గొలిపే కోయిలల కమ్మని పాటలు
భావోద్వేగాల హొయలను చూపే జలపాతాలు
ఊహా విహారపు తూనీగల తారాడటాలు.

అబ్బుర పరిచే జలచరాల ఊహాతీత విన్యాసాలు
అనురాగాలన్నుత్తేజ పరిచే పక్షుల కువకువలు
ఏ మారితే, అమాంతం బంధించే కందకాలు
భీభత్సం సృష్టించే అకస్మాత్తు విస్ఫోటనలు.

తీరని గొంతెమ్మ కోర్కెల గుర్రాల పరుగులు
ఆబగా దరిజేరితే నిరాశపరిచే ఖాళీ తేనెపట్లు
అయోమయానికి గురిచేసే కర్తవ్యపు అల్లిబిల్లి తీగెలు
పశ్చాత్తాప భావనల తొలిచే కుమ్మరి పురుగులు.

దిలాసా దారిలో తెరుచుకున్న
ప్రమాదపు కొండ చిలువల నోళ్ళు
అధాటుగా భయపెట్టే ఆపదా సింహాల ఎదుర్కోళ్ళు
లోతుగా గుచ్చుకునే ఆవేదనా రక్కసి ముళ్ళు
సుఖాల ఉద్విగ్నతతో జలదరింపజేసే
దుఃఖపు మొసళ్ళు.



- ఎస్. కాశింబి
సెల్: 9052216044

## ద్వైతం

జీవితం ఓ రోజు
పగలు
రాత్రి
రెండూ ఉంటాయి.

జీవితం ఓ మాసం
పౌర్ణమి
అమావాస్య
రెండూ ఉంటాయి.

జీవితం ఓ వత్సరం
వసంతం
శిశిరం
రెండూ ఉంటాయి.

జీవితం ఓ ప్రకృతి
పచ్చదనం
మోడుతనం
రెండూ ఉంటాయి

జీవితం నదీప్రవాహం
అనుకూలం
ఆటంకం
రెండూ ఉంటాయి.

కాలప్రయాణం
ప్రకృతిచైతన్యం
నదీప్రవాహం
ఆగటం ఉంటుందా?

నిత్యప్రయాణం
దైవ చైతన్యంతో
సజీవ ప్రవాహంలా
జీవితం ఆగటం ఉండదు...



-సాకి
9951172002

## నానీల

నిత్య గురువు
ప్రకృతి....
చెడిపోతున్నాడు మనిషి
పెడచెవిన పెట్టి...

ఎక్కే నిచ్చెనల పైనే
మనిషి దృష్టి....
మరిచేను
ఎక్కి వచ్చిన మెట్లను....

ఆకాశానికి నిచ్చెన
వేసుకో తప్పులేదు..

ఎదిగే వాని
కాలు లాగకు.

అసూయెందుకు
ఎదుగుతున్నాడని...
అధోగతే
అందరి బాగు కోరకుంటే...

అదుపు లేదు
మనిషి కోరికలకు....
తీరకుంటే ఉండదు
మనశ్శాంతి.



-కళావతి కందగట్ల
9948263004

## కాలం చెల్లని కొరోనా!

కొరోనా కొరోనా కచ్చ కొరోనా
కొంపలు తీసే కార్పణ్యపు కొరోనా
కలవారు పేదవారను తేడా లేకుండా
కాటు వేసే కోపిష్టి కొరోనా
కనికరమనేదే ఎరుగని కల్లోల కొరోనా
కాష్ఠంలా ఎగబాకుతోన్న కొరోనా
కకావికలం చేసి జనాలతో ఆడుతోన్న కొరోనా
కామాంధులను మించి రోత పుట్టిస్తోన్న కొరోనా
కిల కిల నవ్వులను దూరం చేసిన కొరోనా
కోటి కోటి ముక్కు మూతులను మూసేస్తోన్న కొరోనా
కిరాతకుల కంటే పాశవికంగా తయారైన కొరోనా
కడలంత దు:ఖాన్ని పాకిస్తోన్న కొరోనా
కడు బీదలను అథ:పాతాళానికి తోసేస్తోన్న కొరోనా
కదలక మెదలక వృద్ధులను కొంపల్లోనే
కూర్చోబెట్టి వేధించుకుతింటోన్న కొరోనా
కొవాగ్జిన్ వాక్సినేషన్ తో ఉదరకొడుతోన్న కొరోనా
కాలం ఎప్పుడు తీరిపోతుందో
దీనికి తెలియని తప్పుడు కొరోనా!?



-అన్నంరాజు వేణుగోపాల
శ్రీనివాసమూర్తి
9014463489

## ఆర్ద్రత నిండిన క్షణాలు

పుడుతూ తానెడ్చి
చస్తూ తన వారిని ఏడిపిస్తూ
ఏంటో.. కనుల కొలను తడి ఆరని చెలిమ వలె
ఎప్పుడూ నీటితో మెరుస్తూనే ఉన్నది.

కాలం అంకెలను హెచ్చవేస్తుంది
పెరుగుతున్న సంఖ్యలు
భయం గుప్పిట బిగించి గుండెల్లో పిడి గుద్దులు గుద్దుతుంటే..
పాపం కళ్ళే ఆగని జలపాతాలై
గుండెను ఓదార్చాలని పరుగెడుతున్నాయి..

ఓదార్చాలనే మనసులు తండ్లాడినా.. చేయి చాచలేని నిస్సహాయత..
గుండెలకు హత్తుకోలేని ఆర్ద్రత
నిమీలిత చూపులలో ఘనీభవిస్తుంది..
కాలం కానుకిచ్చిన కరోనాను..చూసి
ఆత్మీయతలు విరభూసే అమ్మతనంలోనూ..కరోనా
సరిహద్దు గీతలు గీసి..నవ మాసాలు మోసిన తల్లికి
నవజాత శిశువును చూచే వీలు లేదంటూ..
రాగరంజితమైన బంధాలను రోధనల వేదనలకు అంకితమిస్తుంది..
చేతనైతే తనను కట్టడి చేయమని సవాలు విసురుతూ..



-ఉదయశ్రీ ప్రభాకర్
9866687134

## ఈ క్షణమే నీది

గడచిన కాలం తవ్వుకోవడం ఎందుకు?
రాబోయే కాలం కోసం నిరీక్షణ ఎందుకు?
బతికున్న వర్తమానం మాత్రమే నీదని గ్రహించు!

భూత కాలం తిరిగి రాదు అని తెలుసు,
భవిష్యత్ కాలం ఎలా ఉంటుందో తెలియదు.,
ఉన్న ఈ వర్తమాన కాలం గొప్పదని
ఆహ్లాదంగా జీవించు!

క్షణ క్షణం.. ఆస్వాదించు..
అనుక్షణం సంతోషాలను ఆహ్వానించు!
నిర్మించుకున్న ఆశయాలను
పట్టుదలతో సాధించు..
ఉన్న ఒక్క జీవితాన్ని
ఆనందమయం చేసుకుని జీవించు..!!



-ఎన్.రాజేష్
9849335757

## నేటి నిజాలు

నా గర్భంలో నీకు ఊపిరిపోసి పెంచానురా
నేను పస్తులుండి నీ ఆకలి తీర్చే అమ్మనురా
నీ కన్నీళ్ళను నా కళ్ళల్లో దాచుకున్నానురా
నేను నీ కళ్ళముందే రాలిపోయే ఎండుటాకురా
నీ నీడలో..
నాకూ కాస్త చోటివ్వరా నా ఊపిరి వుండేదాకా
చివరికి
నీ కన్నీటి చినుకులా.. రాలిపోతానురా...!

- కెరె జగదీష్



## బడుగుల రక్షకుడు



మనువాదపు విషచాయల్లో
హక్కులు లేక కుక్కిన పేనుల్లా
నిద్రాణమైన జాతికి ఒక వేగుచుక్కల
వెలుతురును ఇచ్చి మనుషులుగా
గుర్తించే స్థితిని ప్రోది చేసిన యోధుడు.
సతి పతులు సాంఘిక సేవలో
తరించిన తరిణిలు
బలహీన వర్గాల ఆశ జ్యోతిగా
విద్యను అందించి
చీకట్లను పారద్రోలిన కాంతి రేఖ.
అంబేద్కర్ కు ఆదర్శప్రాయుడు అయ్యి
సామాజిక విప్లవానికి నాంది
నిజంగా ఆయనే ఒక జ్యోతిగా
బడుగుల హక్కులకై పులి లా
పోరాడిన జ్యోతి బా పూలే
అందరికి బాపు.



-ఉమరాణి వైద్య, 9000346200

### గమనిక

స్థలాభావం వల్ల మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా సాహిత్యవేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం 'ఏకాంశ కవిత్వం' మరియు 'కణిక' శీర్షికలను ఈవారం వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం.

-సంపాదకులు

## నా నేస్తం ఒక పుస్తకం

నా నేస్తం ఒక పుస్తకం
అలసిన నా మనసుకు ప్రతిసారి
ఆశ్వాసనం ఇస్తుంది.
నా నేస్తం ఒక పుస్తకం
కష్టంలో ఉన్నప్పుడు
అండగా ఉండే ధైర్యాన్ని ఇస్తుంది
నా నేస్తం ఒక పుస్తకం
గతి తప్పిన ప్రతిసారి
నాకు మార్గదర్శనం చేస్తుంది.
నా నేస్తం ఒక పుస్తకం
నన్ను నేనుగా అన్వేషణ సాగించే
ఆలోచనలను ఇస్తుంది.

నా నేస్తం ఒక పుస్తకం
స్పష్టమైన విజ్ఞానాన్ని అందించే
గురువుగా నిలుస్తుంది.
నా నేస్తం ఒక పుస్తకం
ఈ సమాజంలో జ్ఞానాన్ని చూసే
దృష్టి కోణాన్ని ఇచ్చింది.
నా నేస్తం ఒక పుస్తకం
జీవిత గమనాన్ని
జీవన సూత్రాన్ని
జీవిత పాఠాన్ని
వికసింపజేసె ఆలోచన జ్ఞానాన్ని
దృష్టి కోణాన్ని
విధాయక దృష్టితో చూసే
సంస్కారం ఇచ్చింది....



-శ్రీపాల్
8978894808

## లాక్ డౌన్‌లో పెరిగిన దురాచారం

ఆడపిల్లలంటే
ఎప్పుడు చిన్నచూపే
ఆడపిల్లంటే ఈడపిల్లకాదు.

ఆడపిల్లంటే
ఎప్పుడు ఒకే మాట
వేరే ఇంటికి పోవలసిందే
ఆమెకు చదువు దండగ
ఆమెకు వ్యక్తిత్వం దండగ.

ఆమె జీవితం పైన
ఆమెకు ఆలోచన
ఉండకూడదు
తల్లిదండ్రులు పైన
మమకారం ఉండకూడదు.

వయసు ఎదగలేదు
మనసు ఎదగలేదు
శరీరం ఎదగలేదు

పెళ్లి అంటే ఏమిటో తెలీదు
అది బొమ్మల పెళ్ళి కాదు
నిజమైనపెళ్లి.

ఆడపిల్ల ఇష్టంతో
జరిగే పెళ్లికాదు
పెద్దల పెత్తనంతో
జరిగే పెళ్లి
అదే బాల్యవివాహం
అదొక దురాచారం.

ఆనాడొక వీరేశలింగం పంతులు
ఈనాడు అడిగేవాడు ఎవరు
ఆడపిల్లలు ఆస్తులు కాదు
అమ్ముకోవడానికి.

పసితనం పోని
పెళ్లికూతురు

వయసు అయిన
పెళ్లికొడుకు
ఈడు జోడులేని పెళ్లి
మనసులు కలవని పెళ్లి.

దురాచారం రూపుమాపండి
ఆడపిల్లలను
మనసున్న మనుషులుగా
భావించండి



-అరుణ డేనియల్
9000606889

## ఊహల రెక్కలు

ఊహలకు రెక్కలు వచ్చెను
చేతులు చాచి గంతులు వేస్తూ
ఆకాశంలో విహరించెను
హాయి హాయిగా ఎగిరెను

తెల్లతెల్లని మేఘం దాటెను
గాలిలో తేలియాడు చుండగా
మేఘమాలలు స్పర్శించెను
మనసు పరవశమొందెను

చందమామను చూడగోరెను
కుతూహలంగ చూచివచ్చెను
గాలి లేదు నీరులేదక్కడ
భూమి,కొండ,లోయలున్నవక్కడ

ఎగురుతుంటె సముద్రమొచ్చెను
నీరు త్రాగి చూడ ఉప్పగుండెను
మడులలోన సంద్రపు నీరుంచిరి
ఎండబెట్ట ఉప్పు రాశులాయెను.

విహరించగ చల్లగాలి సోకెను
దూరపణువులన్ని దగ్గరాయెను
తెల్లని మేఘాలు నల్లగ మారెను
చూచుచుండ వాన చినుకులాయెను.

గాలిలో ఇసుక కంట్లపడెను
క్రిందికి చూడగ ఇసుక దిబ్బలు
వర్షాలు పడక ఎడారిగ మారెను
ఒంటెలు ఒయాసీస్సు కనిపించెను

పక్షుల అరుపులు వినబడెను
పచ్చని అడవి కనబడెను
అడవి అందం కనులవిందు చేసెను
జంతువులంత చెట్లను నరకొద్దనెను.

హిమాలయం మంచుకొండలు
దిగి నడవగా గుచ్చుకొనెను
మంచు కరిగి నీరు పల్లము చేరెను
గంగ సింధు బ్రహ్మపుత్ర నదులాయెను

అగ్ని పర్వతం బద్దలాయెను
హఠాత్పరిణామానికి భయము వేసెను
భూమి కుతుకుతలాడి లావాపొంగెను
చుట్టుపక్కల నాశన పరిచెను

పచ్చని పంటపొలాలను చూసెను
భక్తితొ గుడులకు తిరిగెను
తాజ్మహల్ అందాల మురిసెను
చరిత్రను కోటలు గుర్తుచేసెను.

ఫ్యాక్టరీల పొగలు వాహనాల రొదలు
కార్బన్ డయాక్సైడ్ కేంద్రకాలు
భూతాపం చాలా చాలా పెరిగెను
ప్రకృతి ధర్మం మాయమాయెను

ఏదో వచ్చి కనులనడ్డగించెను
ఏదని చూడగ ప్లాస్టిక్ కవరు
పర్యావరణ ప్రథమ శత్రువు
వాడొద్దనెను ప్రకృతి గొంతుక



-ఆవుల చక్రపాణి యాదవ్
9963350973

## ఆటవెలది పద్యాలు

బయట కాలు బెట్ట భయమాయె ఇలలోన
పొంచి ఉంది వ్యాధి ముంచి వేయ
గడప దాట వద్దు కాటువేయు ను కరోన
పుండ లీకు మాట పూల బాట

మంచి జ్ఞాన మిచ్చు మహిలోన పొత్తము
చదువ వలెను నెపుడు చక్క గాను
పుస్తకమ్ము వలన మస్తకమ్ము వెలుగు
పుండలీకు మాట పూల బాట

గాలిలోన మేడ కట్టు యువకులంత
పగటి కలలు కంటు బతుకు తారు
కష్టపడిన వారు కార్యము చేస్తారు
పుండలీకు మాట పూలబాట

తెల్ల కోటు తొడిగి చల్లని మనసుతో
కరొన వ్యాధి బాప కష్ట పడిరి
నరుని రూపు లోని నారాయ ణులువారు
పుండలీకు మాట పూలబాట.

ధరణి శక్తి బిందు దశను మార్చునరుని
భూమి కలగి నున్న భుక్తి దొరుకు
నేల తల్లి నమ్మ నెప్పుడు మేలగు
పుండలీకు మాట పూలబాట.

పద్య రచన జేయ పదములుండవలెను
పదము నెంచి పేర్చ భావమెదుగు
భావ అర్థ మున్న పద్యంబె పద్యము
పుండలీకుమాట పూలబాట

మాట మాట పెరిగి మంటలు రగులును
మంచి పలుకు పలుక మమత పెరుగు
మాటకున్న శక్తి తూటకన్న బలము
పుండలీకుమాట పూలబాట

కవుల చేతి కలము కవితలే నిచ్చును
రాజు కరము కత్తి రాజ్యమేలు
రాజుకన్నమిన్న రారాజు కవులంత
పుండలీకుమాట పూలబాట

మనసు మంచిదైన మమకారముదయించు
పగను నీవు పెంచ పాడగుపని
చెడును స్నేహమంత చెరుపకు మంచిని
పుండలీకుమాట పూలబాట

బలము లేని వాని బాధించ ఫలమేమి
అల్ప ప్రాణి పైన అధిక బలము
చూపు నట్టి నరులు చూడగ మూర్ఖులె
పుండలీకుమాట పూలబాట

ఆశ యున్న మనిషి అతిఆశలోపడి
అంద లేని ఆశ అడుగ నేల
ఆశ అదుపు చేయ అంతయు మేలగు
పుండలీకుమాట పూలబాట

లక్ష్మి కరుణ వలన లక్షలే దొరుకును
వాణి మమత తోడ వాక్కు వచ్చు
అమ్మలిద్దరుంటె అదృష్టమేపండు
పుండలీకుమాట పూలబాట

ఆడపిల్ల చదువు అవనికి వెలుగగు
చదువు నేర్ప వలయు చక్కగాను
ఆడ పిల్ల జన్మ అపురూపమైనది
పుండలీకుమాట పూలబాట.

భవిత కెలుగునిచ్చు బాలికామాతల్లి
పుట్టి నింట మరియు మెట్టి నింటి
రెండుచోట్ల పరువు రెట్టింపు చేయును
పుండలీకుమాట పూలబాట.

ఎంత చదువు చదివి ఏమిటి లాభము
కొంచమైన మంచి పంచకున్న
మనిషి యట్ల మహిని మహితాత్ముడగునయ్య
పుండలీకుమాట పూలబాట.

పరుల సొమ్ము చూసి పాడౌను నీమది
పొంద లేక మనిషి కంది పోవు
ఉన్నదానలోన నుండుసంతృప్తిని
పుండలీకుమాట పూలబాట



-జాధవ్ పుండలిక్
రావు పాటిల్
9441333315

## జలమే ఈ జగతికి మూలం

జలమేరా ఈ జగతికి మూలం
జలమేరా ఈ జగతికి ప్రాణం
జలము లేక ఈ జగతి ప్రగతిశూన్యం
జలమే ఈ జగతి పుణ్య ధనం.

జలమే ఈ జగతి జీవుల అమృతం
జలము లేక ఈజగతిన లేదు జీవనం
జలమే ఈ జగతి జీవుల కింధనం
జలముతోనె ఈ జగతికి అందలం.

జలమన్నది నీవు సృష్టించలేవురా!
ధనమన్నది నీ దాహం తీర్చలేదురా!
జలముతోనె నీ జీవగతులు సాగురా
జలములేక బ్రతుకులన్ని బండబడునురా!

జలమే రా ఈ జగతికి మూలం
జలములేకగ్రహాలన్నీ గొడ్డుబోయెరా!
ఈ జగాన నీవు బుద్ధి జీవిరా!
జలం విలువ తెలుసుకొనిబుద్ధిగ బ్రతుకవేలరా?

ముందు తరాల మాట తలప వెందుకు?
నువ్వు వాడుతున్న నీళ్ళు నీవు కూడబెట్టలేదురా!
చీమనైన అడిగితే చెబుతుందిరా!
ఈ నిజం తెలుసుకుంటె నీవు మిన్నరా.



- పి. బక్కారెడ్డి
సెల్: 9705315250

## చిట్టి చామంతులు

సెలవులు
ఉంటేనే కదా!
తల్లితండ్రులకు
పిల్లల అల్లరి తెలిసేది!!

ఎన్నికలు
ఉంటేనే కదా!
నాయకులకు
ఓటరు విలువ తెలిసేది!!

ఉలిదెబ్బలు
తింటేనే కదా!
బండకు
పూజలు దొరికేది!!

రాపిడి
చేస్తేనే కదా!
వజ్రం
తళతళ మెరిసేది!!

-జేపీ రావు పాటిల్,
9441333315

## మానవ విజ్ఞానానికి జయహో..!

జీవన గతిని మార్చిన
ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని
మనుగడ కోసం పోరాటంలో
విజయ గీతికను ఆలపించిన
మానవజాతి చరిత్రకు జయహో..!

గమనానికి కళ్ళెం వేసిన అడ్డంకులను
అధిగమించడం అభ్యసించి
నాగరికత వికాసానికి ఊపిరి పోసి
సంపదను సృష్టిలో సృష్టించడంలో
సఫలీకృతుడైన మానవునికి జయహో..!

జలంలోని విద్యుత్ తేజానికి రెక్కలనిచ్చి
ఒడుపుగా తన అదుపులోనే బంధించిన
నేర్పు గలిగిన క్రాంతికారుడు మనిషి
భయంకరమైన జలధి తనువుపై
నైపుణ్యంతో పడవలలో ప్రయాణించి
దారిని కనిపెట్టిన ప్రగతికారునికి జయహో..!

ఆకాశంలో కాంతులతో శోభిల్లుతున్న
పాలపుంతల రహస్యాల గుట్టు విప్పి
వినూత్న ఆవిష్కరణలకు జీవం పోసి
తనకు తానే సాటని ప్రకటించుకున్న
తరిగిపోని మనిషి అన్వేషణకు జయహో..!.

మానవాళి క్షేమంకై అనునిత్యం అప్రమత్తుడై
సాధనకు పదును పెడుతూనే పురోగమిస్తూ
భూగోళాన్ని ఆవరించిన కరోనా క్రిమి సంహారిణి కై
టీకాయుధాన్ని రూపొందించిన
మానవ విజ్ఞానానికి
జయహో..!
జయ జయ జయ జయహో..!



- గోపగాని రవీందర్
9440979882

## కల్లోలబతుకుల కదనం

నా అక్షరం
అన్యాయంపై ఎత్తిన ఆయుధం.
నాభావం
గుబులుపడుతున్నగుండెచప్పుడు.
నాశిల్పం
సాగుతున్నసామాజికపరిణామం .
నాశైలి
అసత్యంపై శివమెత్తినస్వరం.
నామాండలికం
మట్టిమనుషల మనోవేదన.
నా కవనం
కల్లోలబతుకుల కదనం
కన్నీటిబొట్ల కారకాలవేట
పలు పరిష్కారాలఊట
భవిష్యత్ తరాల బాట
చెరగని చైతన్యపు మేట
చెమటచుక్కల రాజ్యపీట



-జినుకల వెంకటేష్
9652092120

## స్వేచ్ఛాగానం!

నా జనని! నిత్య వసంతాల నిండు జవ్వని!
నా అవని! రక్త పంకిలాల పండు పున్నమి!
నా పుడమి! పుత్తడి మాగాణాల పుణ్య భరణి!
నా ధరణి!ముక్త కంకణాల స్వేచ్ఛా మానిని!.

వారు... మాతృభూమి హృదయ వేదన నెరిగిన ఉద్యమబాలురు!
నిరంతర సంక్షుభిత వ్యాధి మూలం తెలిసిన వైద్యులు!
సతతహరిత సంఘర్షణల ద్వారాలు మూయదలచినవారు!
మరణ మృదంగ ధ్వనులయుద్ధ భేరీలు మ్రోగించినవారు!
వారు!తీవ్ర నేరారోపణల భారాలు మోసిన వారు!

అసమ క్షమాభిక్షలు కోరలేదు...
విషమ పరిస్థితుల్లో చర్చల హద్దులు మీరనీయలేదు...
మరణ శిక్షలు ఖరారు చేసుకున్నారు! బేషరతుగా!
కోరి ఉరి కొయ్యల ఊయలలూగారు!షరతుగా!!

ప్రజాస్వామ్యం! పదవిలో ఉన్నవాని పరిహాసం!!
సామ్యవాదం! పెదవిలో దాగిఉన్న ప్రాణపరిహారం!!
వలసవాదం! పరాయి దేశపు స్వార్థ మమకారం!!
సామ్రాజ్యవాదం! సాంప్రదాయవాద సహకారరాగం!!
వాస్తవికవాదం! స్వేచ్ఛా కాంక్షల బలిదానం!!...
*(మార్చి 23న రాజ్ గురు,సుఖ్ దేవ్, భగత్ సింగ్ లు దేశం కోసం ప్రాణాలు అర్పించిన సందర్భంగా...)*



-కరిపె రాజ్ కుమార్
8125144729

## మది గదిలో...

ప్రభాత వేళ తూరుపు కొండల నడుమన
ఒళ్ళు విరుచుకుంటూ...
తన నులివెచ్చని కిరణాల ప్రసరణతో
బాలభానుడు అవని మేనుపై చేసే తొలి సంతకం
వెలుగుల రాజ్యానికి స్వాగత తోరణం...!

విరిసీ విరియని పూతేనియలు గ్రోలగ
విరి ఒడిని చేరి తుమ్మెద చేయు తొలి సంతకం
ఓ అముద్రిత సుందర ప్రేమ కావ్యం...!

తొమ్మిది నెలల సుదీర్ఘ నిరీక్షణా ఫలమై ఒడి చేరిన
బోసి నవ్వుల లేలేత పసిబిడ్డ బుగ్గను
ముద్దిడుతూ అమ్మ చేసే తొలి సంతకం
ఓ అవ్యాజ్య ప్రేమ సాగర అంకురార్పణం!

బుడిబుడి అడుగుల పద తాడనంతో
భూదేవి తలంపై పాపాయి వేసే తొలి అడుగులు
నూరేళ్ళ జీవిత పయనానికై తొలి సంతకం!

కారుమబ్బుల విడిపడి
వసుధ ఒడిని చేర నింగి కురిపించే
తొలకరి జల్లుల తొలి సంతకం
నిదురించే బీజముల మేల్కొలిపే నవ చేతనం...!

కొండ కోనలను దాటు వంపుసొంపుల వయ్యారి నది
సాగరుడి ఒడి చేరి చేయు తొలి సంతకం
ఓ సుదీర్ఘ పయన ఫల ప్రణయ కేళీ సోయగం...!

విశ్వాంతరాళమందు ఎన్నో కమనీయ ఘట్టాలు...
మది గదిలో తొలి సంతకం చేసుకుంటూ...!



-వెగ్గలం ఉషశ్రీ
9440370066

## జీవన నడక

వయసుతో జతగా జీవన
నడక సాగుతూనే ఉంది
ఒంటరి నడకలో
జంటగా చేరిన
తోడైన జతపాదాలతో కలిసి...
సంసార సారపు అనుభూతులతో
సంతోష దారులెంటా
అడుగులేస్తూ సాగుతూనే ఉన్నాం!

వెలుగు వెంట నీడలా
చీకటి నొసటి వెలుతురులా
దుఖం దాచిన నవ్వులా
ఎత్తులూ పల్లాలు దాటుతూ
బ్రతుకుదారిలో నవ్వుల్ని పండిస్తూ
మరో రెండు జతల చిట్టి పాదాలు
చెరో వైపు చేతిని అందుకుని
మనవెంట అడుగులు వేస్తూ
నడక మరింత ఉత్సాహంగా
కొత్తఆశలతో కొనసాగించాం !

ఎదిగిన చిట్టిపాదాలు
కోరుకున్న ఇష్టమైన పాదాలతో
కలిసి మన నడకను
మరవలేని ఉత్సవంగా జరుపుకున్నాం !

జీవన భాగస్తులతో కొత్త దారుల
కదిలి వెళ్ళిన చిట్టి పాదాలు మన
వెంటలేకున్నా మిగిలిపోయిన
మన జత పాదాలు అలసిపోక
మలి సంధ్యలో మురిపెంగా
నీవూ నేనూ కలిసి నడచివచ్చిన
ఈ అందమైన దారెంటా
ఇన్నాళ్లూ కలిసి
నాటిన ప్రేమ మొలకలు
మనిషితనపు పూలు గా విరిసి
మానవతను పరిమళిస్తుంటే
తృప్తిగా కించిత్ గర్వంగా అలుపెరగని
మన అనంత యాత్రను ఆనందంగా
కలిసి మొదలుపెట్టిన మన నడకను
ఆఖరి క్షణాల దాకా ఆర్తితో
కొనసాగి స్తూనే ఉందాం !



-డా.కె.దివాకరా చారి
9391018972

## రాబందుల రెక్కల చప్పుడు!

ఆకుపచ్చని కాన్వాసుపై
అందమైన సీతాకోకచిలుకలు!
అమాయక మనోఫలకాలపై
ఆవేశార్ద్రిత అంతర్నేత్రాలు!.
కళ్లముందు అనునిత్యం కదలాడే
కనుపాపలు
మారీచుల మాయతెరల మరీచికలై
కనుచూపుమేర కనిపించని
రాబందుల రెక్కల చప్పుడు!.
మాటువేసి కసిగా వేటకోసం
మాటలతో బోల్తా కొట్టించే
మానవ అక్రమ రవాణా మర్రి ఊడలు!
చిరుబురు అలకలతో చిలుకలు!
లక్ష్మణరేఖను దాటివస్తే చాలు!
మగపిల్లల కనుగుడ్లు పెకలించి
అంగడి బజారుల్లో

అర్ధనగ్నంగా బిచ్చమెత్తించి!
ఆడపిల్లలను అదాటున అపహరించి
ఉత్ప్రేరకాలుచొప్పించి
పడుపు వృత్తిలోదించే తోడేళ్ళు!
తల్లి పొత్తిళ్ళలోంచి తరలించి
పోలీసు పొత్తాల్లో కెక్కే లోపే
సరిహద్దులు దాటించే కిలాడి క్రీడలో
ఆనవాలు కోల్పోయి
అనాథలైన అభాగ్యులు!



-కరిపె రాజ్ కుమార్
8125144729

# హైద్రాబాద్ స్వాతంత్ర్య పోరాటం.. అనుభవాలు-జ్ఞాపకాలు..!

ఆంగ్లంలో.. స్వామి రామానందతీర్థగారు రచించిన "హైదరాబాద్ స్వాతంత్ర్య పోరాటము" "అనుభవాలు..జ్ఞాపకాలు" గ్రంథాన్ని హరి ఆదిశేషువుగారు తెలుగులోకి అనువదించారు. స్వామిజీ రచించిన విశిష్టమైన ఆంగ్ల గ్రంథాన్ని ఎక్కడా మూలం దెబ్బతినకుండా 1984లో తెలుగులోకి తెచ్చిన హరి ఆదిశేషువుగారి రచనను తెలంగాణ సాహిత్య అకాడమీవారు పునర్ముద్రణ చేసి మళ్లీ వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం.

ఒకవైపు దేశంలో పోరాటం నడుస్తుంటే.. హైదరాబాద్ సంస్థానంలో రెండు పోరాటాలు నడిచాయి. దేశంలో అఖిల భారతీయ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశంలో స్వాతంత్ర్య పోరాటం నడిస్తే.. సంస్థానంలో స్టేట్ కాంగ్రెసువారు, కమ్యూనిస్టులు విభిన్న లక్ష్యాల కోసం పోరాటం చేశారు.

స్టేట్ కాంగ్రెస్‌లో స్ఫూర్తిని నింపిన నాయకుడు.. తాత్వికుడు స్వామి రామానందతీర్థ..అప్పటి భిన్న పార్శ్వాల పోరాట చరిత్రను అక్షరాల్లో నిక్షిప్తం చేయడం జరిగింది. ఆనాటి హైదరాబాద్ సంస్థానం స్థితిగతుల అంచనాలలో నిష్పాక్షికత ఉన్నప్పటికీ.. నిజాం ప్రభుత్వం తరపున రాయబద్ధ మూడోకోణం.. మీర్ లాయక్ అలీ రాసిన హైదరాబాద్ విషాదంలో దొరుకుతుంది.

ఇంకా నిష్పాక్షికంగా అంచనాలు రావలసి ఉన్న సంగతి తెలంగాణ సంగతి తెలంగాణ సమాజం తప్పక గుర్తిస్తుంది.

హైదరాబాద్ సంస్థానం మూడు ముక్కలైంది. ఆంధ్రప్రదేశ్ అవతరణకు దారి ఏర్పడింది. అందుకే స్వామీజీ తెలుగు జాతి కృతజ్ఞతకు హక్కు దారులైనారు.

భారత స్వాతంత్ర్య పోరాటంలోని తుది ఘట్టాన్ని దృశ్యమానం చేయడంలో స్వామీజీ చూపిన సృజనాత్మక ప్రతిభ ప్రశంసనీయం.

ఆంగ్లంలో స్వామీజీ రచించిన ర చనలోని విశేషాలను.. విశేషాల్లోని వివరణను.. శైలీ.. జిగి బిగి, బరువు, తళుకు, వ్యంగ్యరీతి లక్షణాలను సహజమైన రీతిలో తెలుగులోకి తెచ్చిన హరి ఆదివేషువుగారు అభినందనీయులు.

హైదరాబాద్ రాష్ట్రాన్ని ప్రజాస్వామీకరించి.. భారత యూనియన్‌లో విలీనం చేసే నిమిత్తం.. నైజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం చరిత్రాత్మకమైనది. రామానందతీర్థగారు ఈ పోరాటానికి యిచ్చిన స్ఫూర్తిని ఈ గ్రంథంలో అడుగడుగున చూడగలం.




స్వామీజీ ఆనాటి పోరాటానికి అండగా నిలిచి.. వ్యవస్థీకరించి.. నాయకత్వం వహించిన తీరు తెన్నులను ఈ గ్రంథం ద్వారా తెలుసుకోగలం. స్వామీజీ జీవన స్రవంతిలో వచ్చిన మలుపును.. విద్యార్థి దశలో ఆయన హృదయం ఆవేశంతో ఊగిన సంఘటనలను, అమల్నేర్ సంస్థలో ఉన్న వాతావరణం.. సత్మీలాన్ని ఆయన అలవర్చుకునేందుకు కలిగిన అవకాశాలను.. సహాయ నిరాకరణోద్యమ సమయంలో స్వామీజీ భాగస్వాములైన సంగతులు.. కార్మిక సంఘకార్యకర్తగా స్వామీజీ అనుభవాలు.. విద్యాసంస్థ నిర్వాహకునిగా ఆయన జ్ఞాపకాలు.. తదితర అంశాలను ఈ గ్రంథంలోని వ్యాసాల ద్వారా తెలియజెప్పారు. ప్రజా సమస్యల సముద్ర మథనం ప్రారంభమైన వైనాన్నీ, స్వామీజీ లాతూర్ రాజకీయాల్లోకి ప్రవేశం.. ఆనాటి పరిస్థితుల్లో అనివార్యమైన తిరుగుబాటు.. వందేమాతర ఉద్యమంలో పాల్గొన్నప్పటి జ్ఞాపకాలు ధీర సత్యాగ్రహి వందేమాతరం రామచంద్రరావుతో ఉన్న సాన్నిహిత్యం వంటి అంశాలు ప్రేరణ దాయకంగా ఇందలి వ్యాసాల్లో నిక్షిప్తం చేశారు.

నేరం చేసే స్వభావం గురించి.. ఓ పరిశీలన.. ఉద్యమ విరమణ.. సంప్రదింపులు.. ఆనాడు సత్యాగ్రహి ఎదుర్కొన్న అగ్నిపరీక్ష.. జైలులో ఆధ్యాత్మికసాధన.. 'క్విట్ ఇండియా" ఉద్యమం గురించిన అనుభవాలతో కూడిన వ్యాసాలున్నాయి.

స్వామీజీతో స్వాతంత్ర్య ఉద్యమంలో దూకిన కొందరు మిత్రులతో పొందిన అనుభవాలు.. ప్రాంతీయ భాషాపరిషత్ సభల అభివృద్ధి తదితర అంశాలతో పాటు.. భారతదేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన తుదిపోరాటం, హైదరాబాద్ నడిగడ్డ మీద విజయం సాధించిన విధానాన్ని ఓ వ్యాసంలో చక్కగా పొందుపరిచారు. క్విట్ ఇండియా ఉద్యమం.. హైదరాబాద్ ప్రజాస్వాతంత్ర్య పోరాటానికి ఓ గొప్ప ఊపు వచ్చిన తీరుతెన్నులను.. పరిపాలనా సంస్కరణల నిరాకరణ.. వంటి అంశాలున్నాయి.

ప్రజాబలాన్ని సమీకరించి, వాటిని భూస్వామ్య ప్రతీప శక్తులకు వ్యతిరేకంగా నడిపించేందుకు కృషి చేయడమూ.. మరొక వైపున మనదేశంలో అప్పుడే నిలదొక్కుకుంటున్న ప్రజాస్వామ్య వ్యవస్థను కూలదోసే ఉద్దేశంతో రైతంగాన్ని సాయుధ పోరాటంలోకి ఆకర్షిస్తున్న కల్పించిన మైకం నుంచి ఆ రైతుల్ని తప్పించేందుకు స్వామీజీ కృషి చేసిన సంఘటనలకు సంబంధించిన వ్యాసం బాగుంది.

నిజాంకు వ్యతిరేకంగా జరిగిన తుది పోరాటానికి ముఖ్యమైన ఎత్తుగడ..

హైదరాబాద్ ప్రజాఉద్యమం భారతదేశాన్ని ఎలా ప్రభావితం చేసిందో వివరాలు ఈ గ్రంథంలో స్వామీజీ జ్ఞాపకాల ద్వారా వెల్లడౌతాయి.

కమ్యూనిస్టుల సాయుధ పోరాటం.. స్వామీజీ శాంతి సందేశయాత్ర వ్యాసం ఆసక్తికరంగా ఉంది. రైతుల వ్యథలను తెలుసుకున్న ఆచార్య వినోభాభావే శాంతిదూతగా వ్యవహరించిన ఆనాటి పరిస్థితులను చక్కగా పొందుపరిచారు. శ్రీ బూర్గుల రామకృష్ణారావు అనేక సంవత్సరాలు.. హైదరాబాద్ సంస్థాన ప్రజా జీవితంలోని అనేక రంగాలలో పాల్గొని నాయకత్వం వహించిన ఘటనలను.. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ వ్యాసంలో పొందుపరిచారు.

ముఖ్యంగా రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ హైదరాబాద్ సంస్థాన విభజన హైదరాబాద్ రాష్ట్రాన్ని ప్రజా స్వామీకరించి భారత యూనియన్‌లో విలీనం చేసే నిమిత్తం ఆనాడు నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం గురించిన ఆనే విషయాలు ఈ గ్రంథం ద్వారా ముఖ్యంగా స్వామి రామానందతీర్థ అనుభవాలు.. జ్ఞాపకాల ద్వారా తెలుసుకోగలం.. తెలంగాణ సాహిత్య అకాడమీ పునర్ ముద్రణ చేయడం సంతోషం.. భారతదేశ చరిత్రలో ముఖ్యమైన ఈ ఘట్టాన్ని స్వామీజీ ఆంగ్లంలో పొందుపరిస్తే.. తెలుగులోకి అనువదించిన హరి ఆదిశేషువుగారి కృషి ప్రశంసనీయం. ఆలోచనాత్మక ముఖచిత్రంతో వెలువడిన ఈ గ్రంథలోని స్వామీజీ అనుభవాలు.. జ్ఞాపకాలను.. ఆనాటి పరిస్థితులను మనం సులభంగా గ్రహించడానికి వీలుగా మలచబడింది. ప్రతీ ఒక్కరూ చదువదగిన గ్రంథం.. ప్రతీ గ్రంథాలయంలో ఉంచదగినది. వర్తమాన కాలానికే కాదు.. భవిష్యత్ తరాలకు ఉపయుక్తమైన గ్రంథమిది.

**ప్రతులకు:** తెలంగాణ సాహిత్య అకాడమీ
కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం హైదరాబాద్-500 004.
ఫోన్: 040-29703142

**- దాస్యం సేనాధిపతి**
సెల్: 94405 25544

## ఖర్చులు - కన్నీళ్ళు

నాలుగుఅంకెల జీతం రాగానే
నాలుగు రోజుల్లో వీకెండ్సంటూ
షాపింగ్సంటూ పార్టీలంటూ
పబ్బులంటూ క్లబ్బులంటూ
సినిమాలంటూ షికార్లకంటూ
కార్లల్లో విచ్చలవిడిగా తిరుగుతూ
కార్డుల్లోని కరెన్సీని జల్సాలకు ఖర్చుచేస్తూ
నేడు విలాసాలలో మునిగితేలే మూర్ఖులు
రేపు కులాసాగ బ్రతకలేరు.
కుటుంబ బాధ్యతలు మోయలేక
క్రుంగిపోక తప్పదు
తెచ్చిన అప్పులు తీర్చలేక
కుమిలిపోక తప్పదు
బజారులో పరువుపోయి
బ్రతుకుబరువై అవమానాలకుగురై
ఆత్మహత్యలు చేసుకోక తప్పదు
అందుకే మందు...విందు...పొందు అంటూ
ఖర్చుచేసే...ముందు...కాస్త ఆలోచించాలి
ఇది అనుభవగ్నుల...
ఆత్మఘోష అమరసందేశం
అతిగా ఖర్చు చేసేవారు అవివేకులు
ధనాన్ని వృధా చేసేవారు దరిద్రులు
కొద్దికొద్దిగా పొదుపు చేసేవారే కోటీశ్వరులు
ఇది మన ఇంటిపెద్దల...
మంచిమాట సద్దిమూట.
ఆదాయం - ఖర్చు = పొదుపు
అన్న సూత్రం కన్న
ఆదాయం - పొదుపు = ఖర్చు
అన్న సూత్రం మిన్న అని గుర్తించి
పక్కాగా పాటించేవారే పై కెదుగుతారు
పదికాలాలపాటు
పచ్చని చెట్లలా బ్రతుకుతారు
ఇది ఆరితేరిన
ఆర్థిక నిపుణుల...అంతరంగమథనం
ఈ ఆర్థిక సూత్రాలు ఎరిగినవాళ్ళు
అందరికి దేవుళ్ళే
ఖర్చుల్ని అదుపు చేయకున్న
కడకుమిగిలేది కన్నీళ్ళే



**-పోలయ్య కవి కూకట్లపల్లి**
9110784502

## నేను నాలా ఉండటం కోసం

ఆలోచన ఒకటి,
ఆచరణ మరొకటి!
ఆశించేది ఒకటి,
అందేది వేరొకటి!
అంతులేని జీవితాన
పొంతనలేని
పాత్రలను పోషిస్తూ,
సంతోషాలు నటిస్తూ,
ఎవరికోసమో తపిస్తూ,
పరులమెప్పు కొరకు జపిస్తూ,
మనసును మోసం చేసుకొంటున్నాను.
కల్లలను కలలుగా చేసుకొని,
నావికాని స్వప్నాలను
నా కలలుగ భ్రమించి,
సాకారం చేసుకోవడానికి శ్రమించి,
తనువు తడి ఆరిపోతున్నా,
నా ఉనికి ఉనికిని కోల్పోతున్నా
ఎవరెవరి కోసమో
అరాటపడుతూనే ఉన్నా!.
ఏదో ఒక మూలన
నక్కి,
బిక్కు బిక్కుమంటూ,
నలిగిపోతున్న ' నేను ' కు
ఒక ఉషోదయాన జ్ఞానోదయం
అయింది!
నా కోసం నేను పెంచుకున్న తోటలో
నాకునచ్చిన మొక్కలకు
పూచిన పూలను చూసి
ఆనందించే క్షణం కోసం
ఎదురుచూస్తున్నా!
ఆ సుమధుర సువాసనలను
ఆఘ్రానించడానికి ఉవ్విళ్ళూరుతున్నా!
నాలోనిండిన నిర్వేదాన్ని నైరాశ్యాన్ని
తరిమికొట్టే క్షణం నాదరికి
రావాలని పరితపిస్తున్నా!
ఆ మధుర క్షణాల పరిమళాలను
నాతోపాటే బంధించి, ఉంచుకోవాలని
కలలుకంటున్నా!
నన్ను మార్చాలని, ఏమార్చాలని
చూసే లోకాన
నేను ,నాలా ఉండడం కోసం
నాపై నేను
యుద్ధం ప్రకటిస్తున్నా!

**-మెండు ఉమామహేశ్వర్,**
9849741333

## వాడేమంటాడో...

కలం పట్టుకున్నప్పుడల్లా
నాకు భయం మొదలవుతుంది
వాడేమంటాడోనన్న భయం!.

నేను వెన్నెల తోవల్లో
గతాన్ని పాడుకుంటూ నడిస్తే తప్పేమిటంటాను
వాడు ఎర్రనిదారుల్లో
బతుకును పాడుకుంటూ ప్రవహించమంటాడు
నేను మనసు కంజీరామీద
రేపటి ఆశను పలికిస్తానంటాను
వాడు గుండె దప్పుమీద
ఇప్పటి వాస్తవికతను చాటింపేయమంటాడు
నాకు అనుభూతి తలపుల్లో
తూలిపోతూ సాగిపోవాలనుంటుంది
వాడెక్కడెక్కడి కన్నీళ్ళనో ఏరుకొచ్చి
కొన్ని దుఃఖవాక్యాలుగా రాసిమ్మంటాడు

నిజానికీ, నేను నిజం...వాడు నా నీడ
కవిత్వాన్ని కలవరిస్తున్నప్పుడల్లా
వాడే నిజం...నేను వాడి నీడ
నా అక్షరాలన్నీ
నాలోపలివాడి నీడలే!



**- సాంబమూర్తి లండ**
9642732008

## లోలోపల

సన్నగా మొదలైన సడి..
మనసంతా మధురంగా
అలుముకున్న అలజడి...
ఏమిటిది!
ఈ పరిమళాల పలకరింపు ఎక్కడిది...
చినుకు తడికి గుబాళించే
మట్టి పలుకులా
అణువణువూనా పరుచుకున్న
ఆత్మీయతల సందడి..
అక్షరాల మువ్వల ఘల్ ఘల్ లతో
పద మయూరాల రస ఝరి
వాక్య లయలలో ఊహల తకధిమి
ఆ రమణీయ రాగలహరిలో
ఒక కమ్మని మైకం లోలోపల
మరోలోకమై వర్ణ రంజితమైనది
ఆ తన్మయత్వంలో తెలియని మధనం
నా హృదయ సంద్రంలోవెలిసిన
అక్షర అమృత కలశం.
ఒక చిరంతన శాంతియై
నిరంతర సాధనా రూపమై
సత్యమై,సత్య స్వరమై
నను లాలించే కవితా స్వరం
పురుడుపోసుకున్నది



**-వెల్మల జయపాల్ రెడ్డి**
9441168976

## తరగని ఆస్తి!

దేహానికి వలువ వన్నె తెస్తుంది
మనిషికి సంస్కారం విలువ పెంచుతుంది
తరగని ఆస్తులు కూడబెట్టినా
తలెత్తిచూసే అంతస్తులెన్ని పెరిగినా
సంస్కారం లేని జీవితమొక
వాసనలేని పువ్వులాంటిది
బాల్యంలోనే సంస్కార బీజం నాటితే
ఆ మొక్క మానుగా ఎదిగి
సంస్కార ఫలాలు అందిస్తుంది
భావి తరాలకు స్ఫూర్తినింపుతుంది
చదువుకు సంస్కారం తోడయితే
ఆ సంస్కారమే భూషణమయితే
బ్రతుకంతా పరిమళాలు వెదజల్లే
ఆహ్లాదభరిత సుమ వనమవుతుంది
పలువురికి ఆదర్శప్రాయంగా నిలిచి
చరిత్ర పుటల్లో కీర్తి కిరీటమవుతుంది
సంస్కారమొక తరగని ఆస్తి!

**- వాడపర్తి వెంకటరమణ**
81795 78895.

పుస్తక సమీక్షలు

# సామాజిక చైతన్య వాహిక - కాల స్పర్శ



కాలసర్పాన్ని కాటేసి కాజేసిన
కాలదర్పాన్ని నేను
తిరోగమిస్తున్న లోకాన్ని నిలబెట్టి
పురోగమనం నేర్పుతున్న ప్రగతిని నేను
కలం బలం తెలియనివారు
కత్తుల కోసం వెతుకుతారు
ప్రాణాలు తీసేవి మనకెందుకు
ప్రజలను మేల్కొల్పుదాం రా !
ముందుకు ...

అన్న దాశరథి కృష్ణమాచార్య బాటలో కలం శక్తిని చాటుతున్న కవి ఆనంద్ పెరుమాళ్ళ.

కవిగా, కథకుడిగా సమీక్షకుడిగా సాహితీలోకానికి సుపరిచితులు అయిన పెరుమాళ్ళ ఆనంద్ కవిత్వం ఇటీవల కాలస్పర్శ గా సాహితీ హృదయాలను స్పర్శించింది. కవి సిరా చుక్కలతో అక్షర దీపాలు వెలిగిస్తుంటాడు. అయితే దీనికి అదనంగా ఆనంద్ పెరుమాళ్ళ సృజన సాహితీ సంస్థ నిర్వహణలోనూ వివిధ సాహితీ సభా కార్యక్రమాల్లోనూ ఎప్పుడూ తలమునకలై ఉంటారు. సామాజిక దృక్పథం నిండుగా కలిగిన కవి. అందుకే నేమో ప్రముఖ కవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి కవిత్వం వ్యక్తిత్వానికి ఒక ఖత్రీజీనివ ఎతితీతీనీతీ కవి నైజం కవిత్వంలో దొరికిపోతుంది. అని కాల స్పర్శకు వారు రాసిన ముందుమాటలో అరుదైన వ్యక్తుల్లో ఆనంద్ ను ఒకరిగా గుర్తించారు.

ప్రముఖ కవి తండు కృష్ణ కౌండిన్య కాదేదీ కవిత కనర్హం అని శ్రీశ్రీ అన్నట్లుగానే తాను దర్శించి,పలవరించి అనుభూతిని లేదా ఆవేదనను పొంది ప్రతి విషయాన్ని కవిత్వీకరించారని స్పష్టీకరించారు.

సామాజిక చైతన్యాన్ని రగిలించే కవితా వస్తువులే కాలస్పర్శ నిండా కనిపిస్తాయి.

**"అన్యాయానికి ఆకలయినప్పుడు**
**న్యాయాన్ని నోటకరచుకొని**
**రక్తాన్ని ఆరగిస్తూ**
**చెమటను తాగిస్తుంది**
**ఫ్లీజ్ అంటే వదలదు"** అని కవి అంటాడు 'ఓడిపోతూనే ఉంది' అనే కవితలో. న్యాయం ఓడిపోతూనే ఉంది కవిత్వానికి కాస్తంత చైతన్యాన్ని నింపితే అప్పుడైనా అన్యాయాన్ని నిలదీస్తుంది. నేటి సమాజంలో అంతకంతకూ పెరుగుతున్న అన్యాయాలను చూసి కవి వాపోయిన కవిత ఇది.

**"ఈ దేశాభివృద్ధిని**
**కరోనా లాక్డౌన్ కాలంలో**
**వలస పాదాల నడకల్లో చూడాలి**
**శ్రమ సంపదను నెత్తిన పెట్టుకు తిరిగే**
**శ్రమ కోటీశ్వరులు"** అంటూ వలస కూలీల బతుకు చిత్రాన్ని ఆవిష్కరించిన తీరు పాషాణ హృదయాలలో సైతం ఒకింత ఆర్ద్రతను నింపుతుంది.

**"దిగబడుతున్న సంసార బండిని అమ్మ**
**చెమట చుక్కలతో లాగింది**
**పొట్టకూటికోసం**
**ఒట్టి చేపలమ్మి**
**ఎండు చేపయింది మా అమ్మ"**

అన్నప్పుడు ఆకస్మికంగా అంతర్ధానమైన భర్త, ఒక్కసారిగా మీద పడిన గంపెడు సంసారం, వెక్కిరిస్తున్న విభిన్న సమస్యల నడుమ ఒక స్త్రీ త్యాగశీలత, బాధ్యతాయుత నడత, అననుకూల పరిస్థితులపై ప్రతిఘటన.. ఇలా ఎన్నో అంశాలు 'స్వేదానికి రూపమిస్తే' అనే కవితలో దర్శనమిస్తాయి.

మనిషితనం మాయమై స్వార్థమే పరమార్థంగా గమిస్తున్న వ్యవస్థను చూసి

**"ఓ మనిషి**
**అహంకారాన్ని**
**ఆధిపత్యాన్ని ఆర్పేయి**
**ఆరిపోయిన**
**సమానత్వాన్ని మానవత్వాన్ని**
**ఇకనైనా వెలిగిస్తావా...?"** అంటాడు.

కరోనా విపత్తు దేశాన్ని కబళించి బడులు మూతపడిన సందర్భంలో

**"ఇప్పుడు పిల్లల ఆటల్లేవు పాటల్లేవు**
**కేరింతలసలే లేవు**
**తను ఒంటరిధై**
**శబ్ద స్పర్శ కోసం ఆశగా ఎదురు చూస్తుంది**
**ఆ బడి తల్లి"** అంటూ పాఠశాలకు ప్రాణాన్ని ఆపాదించి బడి పిల్లల బంగారు బాల్యాన్ని కరోనా చిదిమేసిన తీరును,బడి తల్లి విద్యార్థులకు దూరమై వారి రాక కోసం నిరీక్షిస్తున్న వైనాన్ని కవిత్వీకరించిన విధానం మనసు మనసును కదిలిస్తుంది.

'నాన్న ప్రేమ పూలను వర్షించాడు' అనే కవితలో

**" నడి పొద్దులోనే అస్తమించిన సూర్యుడు మా నాన్న**
**తన గుండెలపై ఆడిస్తాడనుకుంటే**
**విధి ఆడించిన ఆటలో ఔవుటయి పోయాడు**
**నాన్న లేని కుటుంబం**
**రవి లేని ప్రపంచమైంది"** అమ్మకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చింది లోకం. అయితే నాన్న లో కూడా ఉండేది అమ్మతనమే కదా. తన భారాన్ని గుండె తలుపు దగ్గరే అదిమిపెట్టి బాధ్యతల ముళ్ల కిరీటాన్ని ఆనందంగా మోసే నాన్నను కోల్పోవటం సృష్టిలో ఏ బిడ్డకైనా పూడ్చలేని వెలితే. రవి లేని ప్రపంచంతో కవి నాన్నను పోల్చడం అంధకారమైన లోకం కనుల ముందు సాక్షాత్కరిస్తుంది.'నాన్న ప్రేమ పూలను వర్షించాడు' అక్షరాలా అద్భుతమైన కవిత. ఇలా చెప్తూ పోతే ప్రతీ కవిత దేనికదే ప్రత్యేకం. పాఠక హృదయాలను సామాజిక అంశాల చుట్టూ పరిభ్రమింప జేస్తుంది. సాధారణం నుంచి అసాధారణం అయిన విశేషాలు, సూక్ష్మాం శాల నుండి సంక్లిష్ట విషయాలెన్నో కవితల రూపంలో కాల స్పర్శ ద్వారా ప్రతి పాఠకున్ని స్పృశిస్తాయి.

ప్రతి కవిత శిల్ప సౌందర్యంతో, అల్పాక్షరాల్లో అనల్పార్థ రచనగా గోచరమవుతుంది. నిగూఢమైన భావాలతో ప్రకాశిస్తుంది. అందుకేనేమో ప్రముఖ కవి సాగర్ల సత్తయ్య ముందుమాటలో అనవసర పదాలు, పదాడంబరాలు కాల స్పర్శలో ఎక్కడా కనబడవు. చైతన్యాన్ని కలిగించే కవితా వస్తువులే అణువణువునా కనిపిస్తాయని తెలిపారు. మొత్తం 43 కవితలలో మానవ సంబంధాలు, అన్నదాతల ఇక్కట్లు, శ్రమజీవుల వెతలు, జీవకారుణ్యం.. ఒక్క మాటలో చెప్పాలంటే సమాజ సజీవచిత్రం కవిత్వమై మది మదిని ఆలోచనతో పాటు రంజింపచేస్తుంది.బలమైన కవిత్వాన్ని అందించే ఆనంద్ పెరుమాళ్ళ కలం నుండి మరెన్నో రచనలు రావాలని ఆకాంక్షిస్తున్నాను.

**ప్రతులకు:** పెరుమాళ్ళ సరళ
ఇ.నెం.150, అమ్మ నిలయం, శివసాయి టౌన్‌షిప్ ఎదురుగా,12వ బెటాలియన్
నల్లగొండ
సెల్: 9052517815
తెలంగాణ .



**- ఉప్పల పద్మ**
8340933244

## ఒంటినిండా గాయాలే

నీ జీవిత పుస్తకంలో అన్నీ
త్యాగాల పేజీలే దర్శనమిస్తాయి.
ఏ పేజీ చదివిన . ..నీ రుధిరంతో
రాసిన రాతలే కనిపిస్తాయి.
ఒళ్ళంతా చెమటలు పట్టిన
దేహంతో....భానుడి కిరణాల
తాకిడికి మేలిమి వజ్రానివై
మెరుస్తుంటావు.
మల్లెతీగల్లా అందమైన మా జీవితాలను
మలిచినందుకు....
నీ జీవిత ప్రయాణమంత
ఎన్ని ముళ్లబాటలో నడిచుంటుందో..
నీ దేహానికి ఎన్ని గాయాలై ఉంటాయో..
ఎద నిండా ఎన్ని బాధలున్నా
చిరునవ్వే నీ మోముకు అలంకారం
దేవతలు పంపిన స్త్రీ మూర్తివి నువ్వు.
నీ తనువునుండి రాలిపడ్డ పసిపిల్లలం.
నీ తరువు నుండి విరబూసిన పువ్వులం.

చీకటి అమావాస్య రాత్రుల్లోను
వెన్నెలను పంచే వెలుగు నువ్వు.
నువ్వు పడే కష్టాల వంతెనపై
జీవనం సాగించే జీవులం.
మా అమ్మవు నువ్వు
మా అందరిని పాలించే
మాతృమూర్తివి నువ్వు.



**-అశోక్ గోనె**
9441317361

## భిన్నత్వంలో ఏకత్వతం..!

మానవత్వంపరిమళిస్తే
దానవత్వందహించిపోతే
సమతమమతలసుగంధం
ప్రపంచమంతానిండిపోతే
మనుషులంతాఒక్కటై
మనస్సులన్నిఏకమై
స్నేహగీతంపాడుతుంటే
విశ్వజనీనతవెల్లివిరియదా!
దేహాలువేరైన
మనులంతాఒక్కటేకదా!
విచక్షణతో
వివక్షతలవిషవృక్షాన్ని
నేలకూల్చితే
పుడమిపౌరులుఏకమై
ప్రగతిదారులనడువగలిగితే
మానవీయసౌరభాలు
మదులనిండిమానవత
మకరందంపొంగిపొరలితే
జగతినగనత
సమతారాగంవినిపిస్తే
విశ్వమానవులు
భిన్నత్వంలోఏకత్వం
సాధిస్తే
సంతోషాలసంబరాల
సప్తస్వరాలుపల్కవా..!



**-డా. గన్నోజుశ్రీనివాసాచారి**
8555899493

## ఓ మేధావీ ... మౌనమెందుకు ?

ప్రశ్నించే తత్వాన్ని
అలవరచుకున్నప్పుడే కదా
మనకున్న హక్కులను
సాధించుకునేది !
కనుల నిండా
కునుకు పడితేనే కదా
విప్లవ జ్వాలలు
ఆరిపోయేవి !
ఆశల తీరం చేరితేనే కదా
ఆకలి దాహం తీరిపోయేది !
అంతిమ సమరం
ఆగిపోతేనే కదా
జీవన యానం
సాగిపోయేది !
జరుగుతున్న అన్యాయాన్ని
ఎదురిస్తేనే కదా
జీవితంలో కలబడీ
తెగబడి నిలబడేది !
అందుకే ...
పోరాటాలే ఇప్పుడు.."శరణ్యం"
లేకపోతే ...
బతుకంతా... "అరణ్యం"!



**- రవి చంచల**
8500330700

# మొదటి అడుగులోనే విలక్షణత ప్రదర్శించిన అరుణా బట్టువార్

చిన్నతనం నుండే అక్షరాలమీద ధ్యాస పెట్టి,తన మనసులో మెదిలిన భావాల్ని కవితలుగా అక్షరీకరించి,ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న తోటి ఛాత్రోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులపై కవితలు రచించి,వారి ఆదరాభిమానాలను చూరగొన్న అరుణ బట్టువార్ గారు"భావతరంగాలు" కవితా సంపుటితో మన ముందుకు వస్తున్నారు.ఉపాధ్యాయులుగా పనిచేస్తూ సాహిత్యంలో రాణిస్తున్న కవయిత్రి అరుణ బట్టువార్ గారికి ముందుగా అభినందనలు. సాహిత్యంవైపు వారు వేసిన మొదటి అడుగు ఇది.జన్మనిచ్చిన తల్లిదండ్రులకు తన మొదటి గ్రంథాన్నికవితారూపంలో అంకితమిస్తూ అమ్మానాన్నలపట్ల తనకున్న ప్రేమను చాటుకున్నారు.




అరుణ బట్టువార్ గారు సామాజిక చింతన కలిగిన వారు.వీరి కవితా సంపుటి గమనిస్తే ఈ విషయం తెలుస్తుంది. పర్యావరణ రక్షణ,అడవి తల్లి,అటవీ జంతువులు,కూలి, ట్రాఫిక్ సిగ్నల్స్, మా వూరి చెరువు తదితర శీర్షికలతో రాసిన కవితలు సామాజిక స్పృహను,సమాజం పట్ల తనకున్న బాధ్యతలకు అద్దంలా ప్రతిబింబిస్తున్నాయి.అరుణ గారి కవితా సంపుటిలో స్మృతి కవిత్వం కూడా చోటు చేసుకుంది.అలంకారాలను కవిత్వంలో ప్రతిక్షేపిస్తూ పది కవితలను కవితా సంపుటిలో చోటు చేసుకోవడం కవితా సంపుటికే వన్నె తెచ్చిందనడంలో అతిశయోక్తి కాదు.మొదటి ప్రయత్నంలోనే ఒక వినూత్న ప్రయోగం చేశారు అరుణ బట్టువార్ గారు.ఇది పాఠకులను తప్పక ఆకర్షిస్తుందని నా నమ్మకం.అంతే గాకుండా తొర్రి మొగుడు, చిలిపి సంసారం,భోగి పళ్ళు,చిన్ని ఆశలు,ఎదురు చూపు, చిన్నిఆశల శ్రీమతి లాంటి హాస్యం పండించే కవితలు కూడా ఉన్నాయి.ఇవి భార్యాభర్తల మధ్య అన్యోన్యత,అనురాగాలు, చిలిపి కయ్యాలను ఒకింత హాస్యరసంతో పండించారు.

కవయిత్రి అరుణ బట్టువార్ గారిలో భావ కవిత్వం,ప్రణయ కవిత్వం కూడా పుష్కలంగా ఉందనడానికి అనేక కవితలు సాక్ష్యంగా నిలిచాయి.

**"నువ్వు వస్తావనీ**
**నన్ను మైమరపిస్తావని**
**యెదనిండా నీ తలపులతో**
**నేనెదురు చూస్తున్న**
**నీ రాకకై"** అంటు ప్రేయసి రాకను ఆహ్వానిస్తూ రాసిన "ప్రియురాలు"కవిత

"నా మనసు ఊహ తరంగాలలో ఉప్పెనలా
నీ కొరకు ఎగిసెగిసి పడుతోంది నెచ్చెలి"

"సుకుమార సుందరి"కవితలో, ప్రేయసిని తలచుకున్న ప్రియుడి మనసులోని కదలికలను

**"నీ వలపు మధువును**
**బంబరమై జుర్రుకొని**
**నీ ఒడిలో పసివాడినై**
**ఓలలాడుతున్న కల**
**నా ప్రేమ సామ్రాజ్య రాణివై**
**నిలిచిపోవాలనే ఆశ**
**నువ్వు కాదంటే ఆగును**
**నా శ్వాస"** అందాల సౌదామినిలో చక్కని ప్రేమ,ప్రణయ, భావకవిత్వాన్ని మన ముందుంచారు.

**"బాధ్యతల నడుమ బంధీవి నీవు**
**సేవలోనే సంకెళ్ళేసుకునీ**
**కుటుంబమనే జైల్లో**
**యావజ్జీవ కారాగార**
**శిక్షలో చిక్కిన**
**ఖైదీని నీవు"** అంటూ

"నిత్యం పనులతో సతమతమౌతూ,ఆ శ్రమను తన ముఖంలో కన్పించకుండా నవ్వులు పులుముకొని,విరామమెరుగని అవిశ్రాంత శ్రమ జీవి స్త్రీ''యని వాస్తవాలను వాస్తవంగా వివరించారు.

మరో కవితలో

**"బతుకు భారం అయినపుడు**
**తోడు నీడ అయినవారు బంధువులు**
**బాధలు అనే సుడిగుండంలో చిక్కినపుడు**
**మేమున్నామని భరోసా ఇచ్చేవారు బంధువులు"** అని తెల్పి చెప్పారు.

అరుణ బట్టువార్ గారి ''భావ తరంగాలు"కవితా సంపుటిలో కవితలన్నీ సామాజిక చింతన,మానవ విలువలు, సందేశాత్మక భావనలతో నిండియున్నవి. మొదటి ప్రయత్నంలోనే కొత్త ప్రయోగాలతో మనముందుకు తన కవిత్వంతో వచ్చిన వీరి కవిత్వాన్ని ఆస్వాదిద్దాం.మరింత మంచి కవిత్వాన్ని రాయడానికి ప్రయత్నిస్తారని ఆశిద్దాం.



**-వైరాగ్యం ప్రభాకర్**
9014559059

## కంచె చేను మేస్తే

కంచె చేను మేస్తే
కను రెప్ప కనుపాప ను కాటేస్తే
కన్నవారే ఉసురు తీస్తే
అభం శుభం తెలియని పిల్లలు
కానరాని లోకాలకు తరలిపోతే
ఇలాంటి చోద్యం ఎక్కడైనా చూసామా?

ఒకవైపు దేశం ప్రగతి పథంలో
దూసుకుపోతున్నదని అంటున్నాము
ఇంకోవైపు మూర్ఖత్వంలో
కొట్టు మిట్టాడుతున్నాము.

ఒకవైపు శాస్త్రవిజ్ఞానం అంటున్నాము
ఇంకోవైపు చూస్తే మాంత్రిక తాంత్రిక
శక్తులతో సహవాసం చేస్తున్నాము.

ఒక వైపు అందని చందమామపై
కాలు మోపుతున్నాము.
ఇంకోవైపు బూజుపట్టిన సిద్ధాంతాలతో
అదఃపాతాళానికి చేరుకుంటున్నాము.
ఒకవైపు టెక్నాలజీ ద్వారా ఎంతో
సాధించామని సంబర పడుతున్నాము
ఇంకోవైపు మూఢత్వం లోకి
దిగబడిపోతున్నాము
తల్లి తండ్రులు గా పిల్లలకు
కర్తవ్యబోధ చెయ్యవలసిన వాళ్లే
హృదయం లేకుండా వాళ్ల చేత్తో నే
ఊపిరితీస్తే
మాటరాని మూగ జంతువులు కూడా
తమ సంతానానికి హాని తలపెట్టవే
సభ్యసమాజం లో ఉంటూ
జంతు ధర్మంకంటే
హీన సంస్కృతి ఎలా అలవడింది.
జన్మనిచ్చిన వారే
జీవం హరించి
ఆత్మను కుళ్లబొడిచి
కొరివి పెడితే
అంతులేని అన్యాయం
తలపెడితే
ఎవరు న్యాయం చెయ్యగలరు



**-అరుణ డేనియల్**
9000606889

## రెండు అక్షరాల పదం

ఆమె తన ఆశలను
ఆశయాలను వారిలో నింపుతూ
ప్రతినిత్యం జీవనదియై ప్రవహిస్తూ
జీవిస్తోంది ఆమె..
తాను మండుటెండలో నడుస్తూ
కాయకష్టం జేస్తూ కాలిబూడిదైనా
తన పిల్లలసుఖానికై పరితపిస్తూ
ప్రతినిత్యం చిగురించే పచ్చని చెట్టామె!
ఆమె పొలంలో చెట్టైనిలుస్తూ
గొడ్డుగోడకు కావలైతూ
పసిపిల్లలకు అన్నీతానై
ఆశయాలనే విత్తులుగా నాటి
ఆత్మవిశ్వాసానే ఆభరణంగా ధరించి
పుట్టువండిన పుట్టెడు గోసను వడుతూ
సంసారజీవితానికి
తానే దిక్సూచై నడుస్తడు.
తాను పస్తులుంటూ
పదిమందికి అన్నమెడుతూ
తన పిల్లలసుఖానికై పాటుపడుతూ
వారి ఎదుగుదలే ఎదతడిగా
అభివృద్ధిదారతోనే దాహార్తిని
తీర్చడానికి జన్మించినతల్లి ఆమె.
కంటిపై కునుకు లేకా
ప్రతినిత్యం శ్రమిస్తూ
చెమట చుక్కలతో
వెలుగునిచ్చే దీపప్రమిదామె.
అష్టకష్టాలను ఎతలను గాక
సుఖసంతోషాలనే కానుకగా
అష్టైశ్వర్యాలనే వారసత్వంగా
విజ్ఞానసుధలనే తరగని నిధులుగా
వారసత్వంగా ఇవ్వడానికే పరితపించే
పరమాత్ముడు సృష్టించిన
పాలధారే అమ్మ.
తాను మనశ్శాంతిని
విశ్రాంతిని గోరక..
దూరాలను చేదించే వలస పక్షై
ప్రకృతి ఒడిలో ప్రవహించే నదియై
అందరి సుఖంలో తనసుఖంజూసుకొనే
మమతానురాగాల కల్పవల్లి.
ఆమె పుట్టినింటి పూదోటలోని ఆణిముత్యం
ఆమె మెట్టినింటి మెడలోని ఆభరణం
చరితలో చెరగని
రెండు అక్షరాలపదం అమ్మ...



**-ఉప్పరి తిరుమలేష్**
9618961384

# తెలంగాణ సినీగేయ వైభవం

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన పుస్తకాల్లో ఈ పుస్తకం ఒకటి. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుగారి ముందుమాట అకాడమీ అధ్యక్షులు డా॥నందిని సిధారెడ్డి "ప్రశంస" చంద్రబోసు, డా॥ సుద్దాల అశోక్‌తేజ అభినందనలు ముందుగా వున్నాయి. దాదాపు పాతిక మంది సినీ కవుల గురించి ఈ పుస్తకంలో రాసారు. వారు రాసిన ప్రఖ్యాతినొందిన పాటలు గురించి ఇతర ముఖ్యాంశాలతో ఈ పుస్తకం రాసారు. సింగిల్‌కార్డ్ రైటర్ నారాయణరెడ్డి గారిలా రాసిన మౌనశ్రీ మల్లిక్, పరిశోధకుడిగా పాటల రచయితగా ఉన్న తిరునగరి శరత్ చంద్ర, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహిత పింగళి చైతన్య.. లాంటి యువ కవుల్ని కూడా పరిచయం చేస్తే సమగ్రత చేకూరేది. కోడిబోయె లక్ష్మమ్మ




అమ్మ బైలెల్లి నాదే లాంటి జానపద గేయకర్త నీలం గణేష్‌రావులాంటి వార్ని రాయాలి. 1889 అక్టోబర్‌లో "కినెటోస్కోప్" కనుగొనడంలో అంత వరకూ ఉన్న (మాయా) మాజిక్ లాంతర్లు అంతర్థానమై వాటి స్థానంలో సినిమా లాంటిది వచ్చింది. మూకీ చిత్రాలు టాకీ చిత్రాలు నుండి నేడు డిజిటల్ దాకా సినిమా ఎదిగింది. భారత్‌లో 1910లో "భక్త పుండలీక్"తో మూకీ సినిమా ప్రారంభం అయింది. ఆర్.జి. టోర్నే నిర్మించారు. 1913- ఫాల్కే రాజాహరిశ్చంద్ర"తో సినిమా ప్రారంభం ఐతే హెచ్ఎంరెడ్డి "భక్త ప్రహ్లాద" తెలుగు సినిమా తొలిగా ప్రారంభమైంది. తొలి తెలుగు సినిమా పాట రాసింది ఖమ్మం జిల్లా వాసి చందాల కేశవదాసు. ''పరితాప భారంబు భరియింప తరమా..." పాట (1932).జ తరువాత క్రమంలో దాశరథి కృష్ణమాచార్యులు 1961లో ఖుషి..ఖుషీగా.. నవ్వుతూ.. అంటూ "ఇద్దరు మిత్రుల్లో" పాట రాసారు. మూడో వ్యక్తి డా॥ సి. నారాయణరెడ్డి 1962లో "నన్ను దోచుకుందువటే" పాటతో "గులేబాకావళి కథ" చిత్రానికి పాట (ఎన్‌టిఆర్) రాసారు. ఆ చిత్రంలో సింగిల్ కార్డ్ రైటర్ సినారె. అన్ని పాటలూ ఆయనే రాసారు. 1997లో రాజ్యసభ సభ్యుడైన సి.నా.రె జీవితంలో ముఖ్యమైన విషయాలు రాసారు. వడ్డేపల్లి కృష్ణగద్దర్, గూడ అంజయ్య, గోరేటి వెంకన్న (ఎంఎల్‌సి), సుద్దాల అశోక్‌తేజ, చంద్రబోసు, అందెశ్రీ, జయరాజు, సిధారెడ్డి, కందికొండ, వరంగల్ శ్రీనివాస్, దాసోజు శ్రీనివాస్(అభినయ), కె.సి.ఆర్., యాదగిరి, యశ్‌పాల్, సురేందర్, శ్రేష్ఠ కృష్ణకాంత్, కాసర్ల శ్యామ్, లక్ష్మి ప్రవీణ...లాంటి వార్ని పరిచయం చేసారు ఈ పుస్తకంలో. ఆనాటి తెలంగాణ ఉద్యమంలో పాటలు రాసిన కవుల పాటలు చిత్రాల్లో వచ్చాయి. కొన్ని జానపద కళావేదికల్లో ప్రాచుర్యం పొందాయి. నీలకంఠం, సుద్దాల హన్మంతు, యాదగిరి బండి, తిరునగరి రామాంజనేయులు లాంటి వారి పాటలు ఉటంకిస్తే పరిపుష్ఠిగా ఉండేది. మలిముద్రణల్లో పని చేస్తే బావుంటుంది.

**ప్రతులకు:** తెలంగాణ సాహిత్య అకాడమీ కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం
హైదరాబాద్-500 004.



**- తంగిరాల చక్రవర్తి**
సెల్: 9393804472

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.